ఆంధ్రజ్యోతి
గరిష్ఠం 31.0
కనిష్ఠం 22.4
ANDHRAJYOTHY


ప్రాజెక్టుల నీటిమట్టం

ప్రాజెక్టు	పూర్తిస్థాయి	ప్రస్తుతం	ఇన్‌ఫ్లో	అవుట్‌ఫ్లో
	నీటి మట్టం (అడుగులు)		(క్యూసెక్కులు)	
సాగర్ (టీఎంసీలు)	590 (312.5050)	503.60 (120.0608)	నిల్	800
మూసీ (టీఎంసీలు)	645 (4.46)	637.53 (2.68)	12.26	నిల్
పులిచింతల (టీఎంసీలు)	175 (45.77)	97.63 (0.59)	నిల్	నిల్

చికెన్ ధరలు | లైవ్ : రూ.130 | డ్రెస్ : రూ.200 | స్కిన్‌లెస్ : రూ.230

నామినేటెడ్ పదవుల పందేరం

షురూ..



పటేల్ రమేష్‌రెడ్డి, ముత్తినేని వీరయ్య



బంధ్రు శోభారాణి, నాగరిగారి ప్రీతం

- ఉమ్మడి జిల్లాలో నలుగురు నేతలకు రాష్ట్రస్థాయి కార్పొరేషన్ పదవులు
- పదవుల కోసం క్యూలో ఉన్న పలువురు నాయకులు
- ఎమ్మెల్సీ, కార్పొరేషన్ చైర్మన్ల పదవుల కోసం ముమ్మర యత్నాలు
- పదవుల కోసం కీలక నేతల చుట్టూ ప్రదక్షిణలు

నామినేటెడ్ పదవుల పందేరం మొదలైంది. మొదటి విడతలో రాష్ట్రస్థాయిలో 35మంది నేతలకు కార్పొరేషన్ చైర్మన్ పదవులు దక్కాయి. లోక్‌సభ ఎన్నికలకు ముందు మార్చి 15వ తేదీనే ఈ ఉత్తర్వులు వెలువడినా, ఎన్నికల కోడ్ నేపథ్యంలో ఇప్పటివరకు గోప్యంగా ఉంచారు. తాజాగా ప్రకటించిన పదవుల్లో ఉమ్మడి నల్లగొండ జిల్లా నుంచి నలుగురు నేతలకు కీలకమైన కార్పొరేషన్ల చైర్మన్ పదవులు దక్కాయి.

- (ఆంధ్రజ్యోతి ప్రతినిధి, నల్లగొండ)

రాష్ట్ర టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్‌గా సూర్యాపేట నియోజకవర్గనేత పటేల్ రమేష్‌రెడ్డి, రాష్ట్ర మహిళా సహకార ఆర్థిక సంస్థ చైర్‌పర్సన్‌గా ఆలేరుకు చెందిన బంధ్రు శోభారాణి నియమితులయ్యారు. రాష్ట్ర ఎస్సీ సహకార అభివృద్ధి సంస్థ చైర్మన్‌గా మోత్కూరుకు చెందిన డాక్టర్ నగరిగారి ప్రీతమ్ నియమితులవగా, రాష్ట్ర దివ్యాంగుల సహకార అభివృద్ధి సంస్థ చైర్మన్‌గా హుజూర్‌నగర్ నియోజకవర్గానికి చెందిన ఎం.వీరయ్య నియమితులయ్యారు. అయితే ఉమ్మడి జిల్లా నుంచి పలువురు కీలక నేతలు, నియోజకవర్గస్థాయి నేతలు, సీనియర్లు రాష్ట్ర స్థాయి పదవులు ఆశిస్తున్న నేపథ్యంలో తొలివిడతలో అవకాశాలు దక్కనివారు మలివిడత ప్రయత్నాలు ముమ్మరం చేశారు. రాష్ట్రస్థాయి కార్పొరేషన్ పదవులతో పాటు జిల్లా స్థాయిలో ఉండే గ్రంథాలయసంస్థ చైర్మన్లు, మహిళా ఆర్గనైజర్ పదవులు, దేవాలయాల కమిటీల చైర్మన్, నుడా చైర్మన్ పదవి, మార్కెట్ కమిటీ చైర్మన్ల వంటి పదవులను ఆశించే నాయకులంతా మంత్రులు, ఎమ్మెల్యేల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు.

పదవులపై పలువురు నేతల ఆశలు

కాంగ్రెస్ అధికారంలో లేని సమయం 2014 నుంచి 2023 వరకు దాదాపు పదేళ్ల పాటు ప్రతిపక్షంలో ఉన్న సమయంలో పార్టీనే నమ్ముకొని ఉండడంతో పాటు గత అసెంబ్లీ ఎన్నికల్లో ఎమ్మెల్యే సీట్లు పొందలేకపోయినవారు, ఎన్నికల సమయంలో ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థుల గెలుపు కోసం కష్టపడ్డ నాయకులు పెద్ద సంఖ్యలో ఉన్నారు. వారు ఉమ్మడి జిల్లా నుంచి ఎమ్మెల్సీలుగా, కార్పొరేషన్ల చైర్మన్లుగా పదవులు ఆశిస్తున్నారు. తుంగతుర్తి అసెంబ్లీ నియోజకవర్గం నుంచి 2014, 2018 ఎన్నికల్లో పోటీచేసి ఓటమిపాలవడంతో పాటు, గత ఎన్నికల్లో పోటీచాన్స్ కోల్పోయినా, పార్టీలోనే కొనసాగుతున్న డాక్టర్ అద్దంకి దయాకర్ పేరు రాజ్యసభకు కూడా పరిశీలించినా సమీకరణాల్లో కుదరలేదని, ఎమ్మెల్సీగా ఆయనకు అవకాశం తథ్యమని పార్టీ వర్గాల్లో చర్చ సాగుతోంది. మాజీ ఎమ్మెల్యేలు వేనేపల్లి చందర్‌రావు, డాక్టర్ కె.నగేశ్ కూడా పార్టీలో క్రియాశీలకంగా ఉండడంతో వీరికి ఎలాంటి పదవులిస్తారనే ఆసక్తి నెలకొంది. నల్లగొండ డీసీసీ అధ్యక్షుడిగా పనిచేస్తున్న కేతావత్ శంకర్‌నాయక్‌కు కూడా ఎమ్మెల్సీగా అవకాశం కల్పిస్తామని పార్టీ ముఖ్యనేతల నుంచి ఎన్నికల సమయంలో హామీ ఇచ్చిన నేపథ్యంలో తనకు పదవి ఖాయమనే విశ్వాసంలో ఆయన ఉన్నారు. నల్లగొండ నియోజకవర్గంలో పార్టీని ముందుకు నడిపి, క్యాడర్‌ని కాపాడుకుంటూ వచ్చిన గుమ్ముల మోహన్‌రెడ్డికి రానున్న రోజుల్లో రాష్ట్రస్థాయి పదవి రానుందని రాష్ట్ర రోడ్లు, భవనాలశాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి బహిరంగంగా ప్రకటించడంతో ఆయనకు కీలకమైన పదవి దక్కడం ఖాయంగా నల్లగొండ కాంగ్రెస్ వర్గాల్లో చర్చ సాగుతోంది. మునుగోడు నియోజకవర్గానికి చెందిన పీసీసీ ప్రధాన కార్యదర్శి పున్నా కైలాష్‌నేత కూడా తనకు పార్టీ పెద్దల ఆశీర్వాదం ఉందని, ఎమ్మెల్సీ లేదా కార్పొరేషన్ చైర్మన్ పదవి ఖాయమనే ధీమాలో ఉన్నారు. యాదాద్రి జిల్లా పార్టీ అధ్యక్షుడిగా కొనసాగుతున్న అండెం సంజీవరెడ్డి, సూర్యాపేట జిల్లా అధ్యక్షుడిగా కొనసాగుతున్న చెవిటి వెంకన్నయాదవ్ తమకు రాష్ట్ర పదవులు వస్తాయనే విశ్వాసంతో ప్రయత్నాలు ముమ్మరం చేశారు. ఉమ్మడి రాష్ట్రంలో ఐడీసీ సంస్థ డైరెక్టర్లుగా పనిచేసిన సాముల శివారెడ్డి (హుజూర్‌నగర్), కంచర్ల యాదగిరిరెడ్డి (తుంగతుర్తి) కూడా కార్పొరేషన్ పదవులొస్తాయనే నమ్మకంలో ఉన్నారు. కార్మికనేత, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్‌గా పనిచేసిన ఎరగాని నాగన్న, పీసీసీ సభ్యుడు వెంకటేశ్వర్లు కూడా కార్పొరేషన్ పదవుల కోసం ప్రయత్నాలు చేస్తున్నారు. వీరితో పాటు కోదాడ నియోజకవర్గం నుంచి ఆర్యవైశ్య వర్గానికి చెందిన మాజీ ఎంపీపీ వంగవీటి రామారావు తనకు ఆర్యవైశ్య కోటాలో రాష్ట్రస్థాయి పదవి ఇప్పించాలని కోరుతున్నారు. ఇదే నియోజకవర్గం నుంచి సీనియర్ నేతలు ముత్తవరపు పాండురంగారావు, చింతకుంట్ల లక్ష్మీనారాయణరెడ్డికి కూడా పరిస్థితులు అనుకూలిస్తే కీలక పదవులు దక్కవచ్చనే చర్చ సాగుతోంది. యాదాద్రి జిల్లా నుంచి పీసీసీ ప్రధాన కార్యదర్శి పొత్నక్ ప్రమోద్‌కుమార్, పంజాల రామాంజనేయులుగౌడ్, లింగంయాదవ్ కూడా కార్పొరేషన్ పదవులు ఆశిస్తున్నారు. భారత్ జోడోయాత్రలో రాహుల్‌గాంధీతో కలిసి పాదయాత్రలో పాల్గొన్న సర్పంచ్‌ల సంఘం రాష్ట్ర మాజీ ప్రధాన కార్యదర్శి జూలూరి ధనలక్ష్మీ మహిళా కోటాలో తనకు రాష్ట్ర స్థాయి పదవి ఇవ్వాలని కీలకనేతలను అభ్యర్థిస్తున్నారు. వీరేకాకుండా ఇంకా పలువురు ద్వితీయశ్రేణి నాయకులు, ఎమ్మెల్యేల విజయంలో కీలకపాత్ర వహించిన నాయకులు తమకు ముఖ్యపదవులు వస్తాయనే ఆశతో ప్రయత్నాలు ముమ్మరం చేశారు.

రాష్ట్ర ప్రభుత్వం స్టాంపులు రిజిస్ట్రేషన్లశాఖకు సంబంధించి భూముల రిజిస్ట్రేషన్ల విలువలను పెంచాలని నిర్ణయించగా, అధికారుల అధ్యయనంలో శాస్త్రీయత లోపించడంతో మళ్లీ మొదటికొచ్చింది. నూతన మార్గదర్శకాలకు అనుగుణంగా రిజిస్ట్రేషన్ విలువలను తిరిగి సమీక్షించాలని ప్రభుత్వం నిర్ణయించింది.

- నల్లగొండ



భూముల విలువల సవరణ

లోపభూయిష్టం

ఉమ్మడి జిల్లాలోని 15 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల పరిధిలో గత నెల 18వ తేదీ నుంచి వారం రోజుల పాటు మండలాలు, పట్టణాలు, నియోజకవర్గాలు, జిల్లా కేంద్రాలు సహా మార్కెట్ విలువలను అధికారులు పరిశీలించారు. అధికారులు 50శాతం నుంచి 60 శాతం మార్కెట్ విలువ పెంచేలా ప్రభుత్వానికి నివేదిక పంపించడంతో ప్రభుత్వం ఆ నివేదికలను తిప్పి పంపింది. రాష్ట్రంలోని అన్ని జిల్లాల నుంచి రిజిస్ట్రేషన్ విలువల పెంపునకు ప్రభుత్వానికి నివేదికలు రాగా, మధ్యతరగతి ప్రజలపై భారంపడకుండా ఈ పెంపు ఉండాలని ప్రభుత్వం యోచించి, కొత్తగా మళ్లీ మార్గదర్శకాలు విడుదల చేసినట్టు సమాచారం. ఆస్తుల కొనుగోలు దారులపై భారం పడితే రియల్ ఎస్టేట్ వ్యాపారంపై తీవ్ర ప్రభావం చూపించనుండటంతో ప్రభుత్వం కొంత మేర వెనక్కు తగ్గింది. భూవిలువల నిర్ధారణ కమిటీలు మరోసారి క్షేత్రస్థాయిలో పర్యటించి అధ్యయనం చేయాలని ప్రభుత్వం సూచించింది.

రేపు 15మంది సబ్ రిజిస్ట్రార్లతో ప్రత్యేక సమావేశం

భూముల విలువల్లో మార్పు చేర్పుల కోసం రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు జూన్ 10వ తేదీన నల్లగొండలో ఉమ్మడి జిల్లాలోని 15మంది సబ్ రిజిస్ట్రార్లతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి భువనగిరి, బీబీనగర్, చండూరు, చౌటుప్పల్, దేవరకొండ, హుజూర్‌నగర్, కోదాడ, మిర్యాలగూడ, మోత్కూరు, నకిరేకల్, నల్లగొండ, నిడమనూరు, రామన్నపేట, సూర్యాపేట, యాదగిరిగుట్ట సబ్ రిజిస్ట్రార్‌లు హాజరుకానున్నారు. ఈ సమావేశంలో నూతన మార్గదర్శకాలకు అనుగుణంగా తిరిగి భూముల సవరణ విలువలను అధ్యయనం చేయాలనే దాని గురించి చర్చించనున్నారు. గత నెల 14వ తేదీన గ్రామీణ, పట్టణ పరిధిలో విలువల నిర్ధారణ చేయాలని కమిటీలను ప్రభుత్వం ఆదేశించగా, గత 18వ తేదీ నుంచి క్షేత్రస్థాయిలో అధికారులు పర్యటించారు. అయినా అడ్డగోలుగా భూ విలువల పెంపుతో తిరిగి మళ్లీ మొదటికొచ్చింది. వాస్తవానికి ప్రస్తుత నివేదికలకు అనుగుణంగా రిజిస్ట్రేషన్ విలువలు పెంచితే ప్రజల నుంచి అభ్యంతరాలు వచ్చే అవకాశాలు ఉన్నట్టు ప్రభుత్వం గ్రహించింది. రిజిస్ట్రేషన్ విలువలను, చార్జీలను భారీగా ఉండకుండా, కొంత మేరకే పెంచాలని ప్రభుత్వం సూచన ప్రాయంగా ఓ నిర్ణయానికి వచ్చిన నేపథ్యంలోనే ఈ మార్పులకు శ్రీకారం చుట్టినట్టు తెలుస్తోంది.

- ఆస్తుల కొనుగోలుదారులపై భారం పడేలా పెంపు
- రెవెన్యూ, ఎస్ఆర్‌ల అంచనాల్లో లోపించిన శాస్త్రీయత
- మళ్లీ సవరించాలని ప్రభుత్వం ఆదేశం
- తిరిగి కొత్త మార్గదర్శకాలతో అధికారుల అధ్యయనం
- మరింత ఆలస్యం కానున్న సవరణ ప్రక్రియ

రెవెన్యూ, ఎస్ఆర్‌ల మధ్య లోపించిన సమన్వయం

ఉమ్మడి నల్లగొండ జిల్లాలోని ఆయా మండలాల తహసీల్దార్లు, సబ్ రిజిస్ట్రార్ల మధ్య సమన్వయ లోపం కారణంగానే భూముల రిజిస్ట్రేషన్ విలువల పెంపులో శాస్త్రీయత లోపించిందని ప్రభుత్వం ఓ అంచనాకు వచ్చింది. కొంత మంది అధికారులు క్షేత్రస్థాయి పర్యటనకు వెళ్లకుండానే ఫోన్ ద్వారా అధ్యయనాన్ని మమా అనిపించినట్లు తెలుస్తోంది. తహసీల్దార్లు, సబ్ రిజిస్ట్రార్లు ఇష్టానుసారంగా అంచనాలు రూపొందించడం సమస్యగా మారింది. ప్రస్తుత మార్కెట్ విలువలకు అనుగుణంగా భూముల ధరలు సవరించకుండా 50 శాతం నుంచి 60శాతం పెంచుకుంటూపోయారు. అయితే 50శాతం లోపు ఉంటుందా లేక ఏ విధంగా ఉంటుందనేది స్పష్టత లేదు. అధికారులు పంపిన ప్రస్తుత మార్కెట్ విలువలకు, రిజిస్ట్రేషన్ విలువలకు భారీ గా వ్యత్యాసం ఉండటంతో ఎలాంటి విమర్శలకు తావు లేకుండా శాస్త్రీయ పద్ధతిలో భూముల సవరణ చేయాలని రాష్ట్ర ప్రభుత్వం ఆదేశించింది. ఉమ్మడి జిల్లాలో మార్కెట్ ధరలు, రిజిస్ట్రేషన్ విలువలకు ఏ మాత్రం పొంతన లేకుండా ఒక్కో ప్రాంతంలో ఒక్కోలా భూముల విలువలు సవరించడంతో అందులో హేతుబద్ధ త కొరవడిందని తెలుస్తోంది. అధికారులు లోతైన అధ్యయనం చేయకుండానే తూతూ మంత్రంగా వ్యవహరించడంతో సమస్య మొదటికి వచ్చింది. అధికారులు స్థానికంగా బిల్డర్లు, రియల్ ఎస్టేట్ వ్యాపారులతో కూడా మాట్లాడి ఓ అంచనాకు రావాల్సి ఉంటుంది. ఉమ్మడి జిల్లాల పరిధిలో కొన్ని ప్రాంతాల్లో మార్కెట్ విలువల కంటే ప్రభుత్వ ధర అధికంగా ఉన్న నేపథ్యంలో అలాంటి ప్రాంతాలను గుర్తించి రిజిస్ట్రేషన్ విలువలు తగ్గించాలని ప్రభుత్వం సూచించింది.



మరోసారి క్షేత్రస్థాయి పరిశీలన

భూముల రిజిస్ట్రేషన్ విలువల సవరణ మళ్లీ మొదటికి రావడంతో అధికార యంత్రాంగం మరోసారి క్షేత్రస్థాయి పర్యటనకు వెళ్లక తప్పనిసరి పరిస్థితి ఏర్పడింది. అధ్యయనం సరిగా లేకపోవడంతో ఈ సారి పకడ్బందీగా క్షేత్ర స్థాయిలో కచ్చితమైన సమాచారాన్ని సేకరించి నివేదిక పంపాలని ప్రభుత్వం స్పష్టం చేయడంతో పాటు ఆ మేరకు ఆదేశాలు జారీ చేసింది. ప్రజలపై ఫీజుల భారం పడకుండా మధ్యతరగతి ప్రజలను దృష్టిలో ఉంచుకొని సవరణలు చేయాలని, అదే సమయంలో ప్రభుత్వ ఖజానాకు గండి పడకుండా ఉండేలా చూడాలని ప్రభుత్వం ఆదేశించిన నేపథ్యంలో సవరణలకు అధికారులు సన్నద్ధమవుతున్నారు. ఈనెల 10వ తేదీన ఉమ్మడి నల్లగొండ జిల్లా అధికారుల సమావేశంలో ప్రభుత్వం ఇచ్చిన మార్గదర్శకాలు అనుగుణంగా క్షేత్రస్థాయిలో ఎలా అధ్యయనం చేయాలనే దానిపై విధివిధానాలు రూపొందించనున్నారు. పూర్తిగా హేతుబద్ధంగా, శాస్త్రీయ పద్ధతిలో ఈ సారి అధ్యయనం నిర్వహించనున్నారు. వచ్చే నెల ఆగస్టు నుంచి పెంచిన సవరణలు అమలులోకి తీసుకురావాలని గతంలో ప్రభుత్వం యోచించగా, మళ్లీ అధ్యయనం చేయాల్సి రావడంతో ఈప్రక్రియ ఆలస్యమయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి.

ప్రభుత్వ ఆదేశాల మేరకు పనిచేస్తాం



రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు భూముల రిజిస్ట్రేషన్ విలువల సవరణపై అధ్యయనం చేస్తాం. ఈనెల 10న నల్లగొండలో ఉమ్మడి నల్లగొండ రిజిస్ట్రా సమావేశం ఏర్పాటు చేశారు. ప్రభుత్వం నుంచి వచ్చిన మార్గదర్శకాలకు అనుగుణంగా అధ్యయనంపై ఈ సమావేశంలో నిర్ణయం తీసుకుంటాం. గతంలో నిర్వహించిన క్షేత్రస్థాయి పరిశీలనలో హెచ్చుతగ్గులు ఉంటే తిరిగి పరిశీలన చేసేందుకు నిర్ణయం తీసుకుంటాం.

- కోమటిరెడ్డి వేణుగోపాల్‌రెడ్డి, నల్లగొండ సబ్ రిజిస్ట్రార్

నూతన ఆవిష్కరణలకు

జిల్లా వేదిక కావాలి



కలెక్టర్ తేజస్‌నందలాల్ పవార్

సూర్యాపేట(కలెక్టరేట్), జూలై 8: నూతన ఆవిష్కరణలకు జిల్లా వేదిక కావాలని కలెక్టర్ తేజస్‌నందలాల్ పవార్ అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లో ఇంటింటా ఇన్నోవేషన్ కార్యక్రమ పోస్టర్లను ఆవిష్కరించి మాట్లాడారు. జిల్లాలోని అన్ని యాజమాన్య పాఠశాలలు, కళాశాలల్లో చదువుతున్న విద్యార్థులు మూడు నిమిషాల వ్యవధిలో వీడియో తీసి 9100678543 నంబర్‌కు వాట్సప్ చేయాలన్నారు. దీనిపై విద్యాశాఖ అధికారులు అవగాహన కల్పించాలన్నారు. ఎంపికైన ఆవిష్కరణలకు స్వాతంత్ర దినోత్సవం నాడు పరేడ్ గ్రౌండ్‌లో జరిగే కార్యక్రమంలో ప్రదర్శనకు అవకాశం ఉంటుందన్నారు. కార్యక్రమంలో జడ్పీ సీఈవో అప్పారావు, డీఆర్‌డీవో మధుసూధనరాజు, డీఎంహెచ్‌వో డాక్టర్ కోటాచలం, డీపీవో సురేష్‌కుమార్, డీటీడీవో శంకర్, డీడబ్ల్యూవో వెంకటరమణ, డీఈవో అశోక్, జిల్లా సైన్స్ అధికారి ఎల్.దేవరాజ్ పాల్గొన్నారు.

వనమహోత్సవ లక్ష్యాలను పూర్తిచేయాలి: జిల్లాలో శాఖల వారీగా కేటాయించిన వనమహోత్సవ లక్ష్యాలను పూర్తి చేయాలని కలెక్టర్ తేజస్‌నందలాల్ పవార్ అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్ బీఎస్.లతతో కలిసి నిర్వహించిన 'ప్రజావాణి' కార్యక్రమంలో ప్రజల నుంచి దరఖాస్తులు తీసుకున్నారు. అనంతరం అధికారులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లాలో ఈ ఏడాది వన మహోత్సవంలో భాగంగా 53.45లక్షల మొక్కలు నాటేందుకు లక్ష్యంగా నిర్దేశించామన్నారు. ఇప్పటి వరకు 7.98లక్షల మొక్కలు నాటామని తెలిపారు. సీజనల్ వ్యాధులు వ్యాప్తిచెందకుండా వైద్య ఆరోగ్యశాఖాధికారులు ముందస్తు చర్యలు తీసుకోవాలన్నారు. ప్రజాపాలన దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలన్నారు. మహిళా సంఘాలకు మీ-సేవా కేంద్రాలు, క్యాంటీన్లు ఏర్పాటు చేసేందుకు ఉత్సాహంగా ఉన్న వారిని గుర్తించి వారికి ప్రత్యేక శిక్షణ ఇవ్వాలన్నారు. జిల్లాలోని వసతి గృహాలను పర్యవేక్షించేందుకు ప్రత్యేకాధికారులను నియమిస్తున్నట్టు తెలిపారు. వారు వారానికి రెండు రోజులు వసతి గృహాలను తనిఖీచేసి నివేదికలు అందజేయాలన్నారు. ప్రతీ వసతి గృహంలో ఫిర్యాదుల బాక్సు ఏర్పాటు చేయాలన్నారు. మండల ప్రత్యేకాధికారులు ప్రతీ మంగళ, శుక్రవారం ప్రభుత్వ పథకాల అమలుతీరును తనిఖీలు చేయాలన్నారు. రేషన్ పంపిణీపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయాలన్నారు. సమావేశంలో జడ్పీ సీఈవో అప్పారావు, డీఆర్‌డీవో మధుసూధనరాజు, సీపీవో కిషన్, డీపీవో సురేష్‌కుమార్, సంక్షేమాధికారులు జగదీశ్వర్‌రెడ్డి, అనసూర్య, శంకర్, లత, తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా అదనపు ఎస్పీ నాగేశ్వర్‌రావుతో కలిసి నిర్వహించిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లాకు గంజాయి, ఇతర మత్తుపదార్థాలు రవాణా కాకుండా చెక్‌పోస్టుల్లో గట్టి నిఘా ఏర్పాటు చేయాలన్నారు. మత్తు పదార్థాలకు యువత, విద్యార్థులు బానిసలు కాకుండా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని ఆదేశించారు. ఇదిలా ఉండగా, తన పేరున పట్టా ఉన్న వ్యవసాయ భూమిని తనకు తెలియకుండా ఇతరులకు కొంతభాగాన్ని పట్టా చేసిన పూర్వ వీఆర్ఏపై చర్యలు తీసుకోవాలని చిలుకూరు మండలం బేతవోలు గ్రామానికి చెందిన నాపసాని కళమ్మ సోమవారం జిల్లా కలెక్టర్ తేజస్‌నందలాల్ పవార్‌కు ఫిర్యాదు చేసింది. పురుగుమందు డబ్బాతో కలెక్టరేట్‌కు రాగా, రాజశేఖర్ అనే కానిస్టేబుల్ ముందుగానే గమనించి ఆమె నుంచి లాక్కొని కలెక్టర్ వద్దకు తీసుకెళ్లడంతో బాధితురాలు కలెక్టర్‌కు ఫిర్యాదుచేసి న్యాయం చేయాలని కోరింది.

ఇందిరమ్మ రాజ్యాన్ని రుజువు చేస్తాం

- మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి
- ట్రామాకేర్ సెంటర్‌కు భూమి పూజ


సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి

కేతేపల్లి, జూలై 8: ఎన్నికల సందర్భంగా ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారెంటీలతో పాటు ఇతర పథకాలు ప్రారంభించి తెలంగాణలో ఇందిరమ్మ రాజ్యాన్ని రుజువు చేస్తామని రాష్ట్ర రోడ్లు, భవనాలశాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అన్నారు. 65వ నెంబర్ జాతీయ రహదారిపై కేతేపల్లి మండలంలోని కొర్లపహాడ్ టోల్‌ప్లాజా ఆవరణలో ఎకరం విస్తీర్ణంలో ఆటోమెటిక్ డేటా ప్రాసెస్(ఏడీపీ)సంస్థ ఆధ్వర్యంలో ట్రామాకేర్ సెంటర్ భవన నిర్మాణ పనులకు సోమవారం నిర్వహించిన భూమి పూజలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, ఏడీపీ సంస్థను దేశంలో ప్రారంభించి 25ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా సీఎస్ఆర్ కింద రూ.5కోట్ల వ్యయంతో హైదరాబాద్-విజయవాడ 65వ నెంబర్ జాతీయ రహదారిపై ట్రామాకేర్ సెంటర్ ఏర్పాటుకు ముందుకు రావడం అభినందనీయమన్నారు. ట్రామాకేర్ సెంటర్ నిర్మాణ పనులు పూర్తికాగానే ప్రారంభానికి సంస్థ సీఈవో మరియబ్లాక్‌ను ఆహ్వానించి తెలంగాణ అభివృద్ధికి మరింత సహకారం తీసుకుంటామన్నారు. 65వ నెంబర్ జాతీయ రహదారి ఆరు నెలల్లో ఆరు లేన్లుగా మారుతుందన్నారు. హైదరాబాద్ నుంచి విజయవాడకు ఎలాంటి ప్రమాదాలకు తావులేకుండా కేవలం రెండు గంటల వ్యవధిలో చేరవచ్చునన్నారు. రోడ్డు పనుల సమయంలో పోలీసులు ప్రమాదాల నివారణపై అవగాహన సదస్సులు నిర్వహించి ప్రజలను చైతన్యం చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఏడీపీ సంస్థ ఇండియా హెడ్ విజయ్ వేములపల్లి, భువనగిరి ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, ఆర్‌అండ్‌బీ ప్రత్యేక కార్యదర్శి దాసరి హరిచందన, కలెక్టర్ సి.నారాయణరెడ్డి, నల్లగొండ, సూర్యాపేట జిల్లా ఎస్పీలు శరత్‌చంద్ర పవార్, సన్‌ప్రీత్ సింగ్, నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం, డీసీఎంఎస్ చైర్మన్ బోళ్ల వెంకటరెడ్డి, మండలి మాజీ డిప్యూటీ చైర్మన్ నేతి విద్యాసాగర్, నాయకులు దైద రవీందర్, చామల శ్రీనివాస్, కోట మల్లికార్జునరావు, కె.శ్రీనివాసయాదవ్, కోట పుల్లయ్య, జె.వెంకటనర్సయ్యయాదవ్, లింగాల వెంకన్న, పి.శేఖర్, డి.నాగేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

ట్రాన్స్‌జెండర్లను కుటుంబ సభ్యులుగా ఆదరించాలి : మంత్రి

చిట్యాలరూరల్: ట్రాన్స్‌జెండర్లను వివక్షతో చూడకుండా కుటుంబంలో ఒకరిలా చూడాలని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అన్నారు. సోమవారం మండల పరిధిలోని గుండ్రాంపల్లిలో 'బేటీ బచావో-బేటీ పడావో' కార్యక్రమంలో భాగంగా యుక్త వయసు బాలికల చైతన్య కార్యక్రమం, ట్రాన్స్‌జెండర్లకు స్వయం ఉపాధి కార్యక్రమాల ప్రారంభోత్సవంలో ఆయన మాట్లాడారు. ట్రాన్స్‌జెండర్లు ఉపాధిలేక యాచకులుగా మారి రోడ్లపై భిక్షాటన చేయడం బాధేస్తోందన్నారు. జిల్లాలో 170 మంది ట్రాన్స్‌జెండర్లు ఉన్నారని, వారికి స్వయం ఉపాధి అవకాశాలు కల్పిస్తూ గౌరవం పెంచుతామన్నారు. వలిగొండ మండలం మాందాపురం గ్రామానికి చెందిన వ్యాపారవేత్త సోలిపురం ప్రభాకర్‌రెడ్డి (ఎస్పీ.రెడ్డి) ట్రాన్స్‌జెండర్లకు ఉపాధి కల్పించేందుకు ముందుకు వచ్చి రూ.40 లక్షలతో హోటల్‌ను నిర్మించి ఇస్తున్నారన్నారు. అంతేగాక హోప్ కేఫ్‌లను ఏర్పాటు చేయించి ఉపాధిని కల్పిస్తామన్నారు. గుండ్రాంపల్లిలో మిషన్ భగీరథ ద్వారా పక్షం రోజుల్లో తాగునీటిని అందించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో భువనగిరి ఎంపీ చామల కిరణ్‌కుమర్‌రెడ్డి, రోడ్డు భవనాలశాఖ రాష్ట్ర ప్రత్యేక కార్యదర్శి దాసరి హరిచందన, కలెక్టర్ నారాయణరెడ్డి, నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం, డీసీసీబీ వైస్‌చైర్మన్ దయాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

నూతన చట్టాలపై ప్రజలకు అవగాహన

ఎస్పీ సన్‌ప్రీత్‌సింగ్

సూర్యాపేటక్రైం, జూలై 8: నూతన చట్టాలపై ప్రజలకు అవగాహన కల్పిస్తామని ఎస్పీ సన్‌ప్రీత్‌సింగ్ అన్నారు. సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో అదనపు ఎస్పీ నాగేశ్వర్‌రావుతో కలిసి నూతన చట్టాలపై రూపొందించిన పోస్టర్లను ఆవిష్కరించి మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం ఈనెల 1 నుంచి నూతన న్యాయ చట్టాలను అమలులోకి తెచ్చిందన్నారు. ఇప్పటి వరకు అమలులో ఉన్న చట్టాల స్థానంలో నాగరిక్ సురక్షసంహిత, భారతీయ న్యాయసంహిత, భారతీయ సాక్ష్యా అధినియం చట్టాలను తీసుకువచ్చిందన్నారు. ఈ చట్టాలపై జిల్లా పోలీసులకు శిక్షణ తరగతులు నిర్వహించామన్నారు. నూతన చట్టాలు అమలులోకి వచ్చిన తర్వాత జిల్లాలో 170 కేసులు నమోదయ్యాయన్నారు. చట్టాలను అతిక్రమించకుండా పౌరులు బాధ్యతగా నడుచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో డీఎస్పీ మామిళ్ల శ్రీధర్‌రెడ్డి, ఎస్‌బీఐ వీరరాఘవులు, సీఐలు రఘువీర్‌రెడ్డి, చరమందరాజు, శ్రీను, తదితరులు పాల్గొన్నారు.


నూతన చట్టాలపై పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఎస్పీ సన్‌ప్రీత్‌సింగ్

ప్రజా సమస్యలను పరిష్కరించాలి

జిల్లాలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఎస్పీ సన్‌ప్రీత్‌సింగ్ జిల్లా పోలీసులను ఆదేశించారు. సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో నిర్వహించిన 'ప్రజావాణి' కార్యక్రమంలో ప్రజలు అందించిన ఫిర్యాదులను తీసుకొని మాట్లాడారు.



చౌటుప్పల్ పట్టణానికి

మహర్దశ

- ప్రధాన రోడ్డు విస్తరణ
- ఫ్లై ఓవర్ నిర్మాణం
- ఆర్ఆర్ఆర్ ఇంటర్ చేంజ్ జంక్షన్ ఏర్పాటు

7లో..

'మీ-సేవ'లు ఇక

నగదురహితం

ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు డిజిటల్ తరగతులు

» ఇప్పటివరకు మూడు రాష్ట్రాల్లో 284 డిజిటల్ తరగతులు » తాజాగా మరో 100 పాఠశాలలకు విస్తరణ » టీచ్ ఫర్ చేంజ్ సీఈవో, సినీ నటి మంచు లక్ష్మి


డిజిటల్ తరగతులను వీక్షిస్తున్న ఎమ్మెల్యే అనిల్‌కుమార్‌రెడ్డి, నటి లక్ష్మి

భువనగిరి టౌన్, జూలై 8: ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు కార్పొరేట్ పాఠశాలల తరహాలో విద్యావకాశాలు కల్పించే లక్ష్యంతో టీచ్ ఫర్ చేంజ్ సంస్థ పని చేస్తోందని ఆ సంస్థ సీఈవో, సినీ నటి మంచు లక్ష్మి అన్నారు. సోమవారం యాదాద్రి భువనగిరి జిల్లాలో క్లౌడ్4సీ, స్వచ్ఛంద సంస్థ సహకారంతో 33 ప్రభుత్వ పాఠశాలల్లో ఏర్పాటు చేసిన డిజిటల్ తరగతులను ఆమె ప్రారంభించారు. ఇప్పటివరకు తెలంగాణలో 264, ఆంధ్రప్రదేశ్, బెంగుళూరులో పదేసి చొప్పున మొత్తంగా 284 ప్రభుత్వ పాఠశాలలో తమ సంస్థ పక్షాన డిజిటల్ తరగతులు,రెండు పాఠశాలల్లో కంప్యూటర్ ల్యాబ్‌లు ఏర్పాటు చేశామని తెలిపారు. తాజాగా క్లౌడ్4సీ స్వచ్ఛంద సంస్థ ఎండీ.పిన్నపురెడ్డి శ్రీధర్‌రెడ్డి సహకారంతో యాదాద్రి జిల్లాలో 33 డిజిటల్ తరగతులను ప్రారంభించినట్లు తెలిపారు. అంతేకాక మూడు సంవత్సరాల పాటు డిజిటల్ తరగతుల నిర్వాహణకు సహకరిస్తున్నామని, ప్రతీ సంవత్సరం ఉపాధ్యాయులకు శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. విద్యార్థులకు సంవత్సరానికి 3 డిజిటల్ కాంపిటీషన్స్ నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ సందర్భంగా సంస్థ ఎండీ శ్రీధర్‌రెడ్డి మాట్లాడుతూ యాదాద్రిభువనగిరి జిల్లాలో త్వరలో మరో 100డిజిటల్ తరగతులు ఏర్పాటు చేస్తామని, జిల్లా కేంద్రం భువనగిరిలోని ప్రభుత్వ బాగాయత్ పాఠశాలలో కంప్యూటర్ ల్యాబ్ ఏర్పాటు చేస్తామని ప్రకటించారు. కలెక్టర్ హనుమంతు కె జెండగే మాట్లాడుతూ ఉత్తమ, ఉన్నత విద్యకు సాంకేతిక అవగాహన దోహదపడుతుందని అన్నారు. డిజిటల్ తరగతుల్లో వీడియో, ఆడియోల ద్వారా పాఠ్యాంశాల బోధన సులువవుతుందని, అదే సమయంలో విద్యార్థుల్లో ఆసక్తి కూడా పెరుగుతుందన్నారు. అమ్మ ఆదర్శ కమిటీల ద్వారా ప్రభుత్వ పాఠశాలలను ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా తీర్చిదిద్దుతున్నామని, మౌలిక వసతులతో పాటు తరగతి గదికి అవసరమైన నియామకాలు, అనువైన పరిస్థితులు కల్పిస్తున్నట్లు తెలిపారు. ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులే మెరుగైన ఫలితాలు సాధిస్తున్నారని, ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి ప్రభుత్వం విశేష కృషి చేస్తున్నదన్నారు. విద్యార్థులు సకాలంలో పాఠశాలలకు చేరేలా అన్ని రూట్లలో త్వరలో బస్సులు నడపనున్నట్లు తెలిపారు. అన్ని ప్రభుత్వ పాఠశాలలో వాటర్ ప్లాంట్లు ఏర్పాటు చేస్తున్నట్లు ఇప్పటికే దివీస్ లేబొరేటరీస్ సహకారంతో 40 వాటర్ ప్లాంట్లు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ గంగాధర్, డీఈవో డాక్టర్ కె.నారాయణరెడ్డి, మునిసిపల్ చైర్మన్ పోతంశెట్టి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

సమావేశం ముగుస్తున్న క్రమంలో 9వ తరగతి విద్యార్థి సాయి వేదిక ముందుకు వచ్చి ఎమ్మెల్యేను ఉద్దేశిస్తూ నాకు పించన్ రావడం లేదు.. ఇప్పిస్తావా.. అని గట్టిగా అనడం అందరినీ ఆశ్చర్యపర్చడంతో పాటు సభను నవ్వులతో ముంచెత్తింది. అయితే దివ్యాంగుని కోటాలో సామాజిక పించన్ రాకపోవడంతో మనస్తాపంతో ఉన్న ఆ విద్యార్థి ఎమ్మెల్యేను అడిగాడని పేర్కొంటూ ఉపాధ్యాయులు అతడిని తీసుకెళ్లారు.


విద్యార్థిని పక్కకు తీసుకెళుతున్న ఉపాధ్యాయులు

విద్యుదాఘాతంతో రైతు మృతి

గరిడేపల్లి, జూలై 8: పొలంలో విద్యుత్‌స్తంభం ఏర్పాటుచేసి వైర్లు లాగుతున్న క్రమంలో ఓ రైతు విద్యుదాఘాతంతో మృతిచెందాడు. సోమవారం సూర్యాపేట జిల్లా గరిడేపల్లి మండలం కాచవారిగూడెంలో ఈ సంఘటన జరిగింది. కాచవారిగూడెం గ్రామానికి చెందిన రైతు కోడి నాగరాజు(45) తనకున్న అర ఎకరం పొలంలో వ్యవసాయం చేసుకుంటూ జేసీబీ ఆపరేటర్‌గా జీవనం సాగిస్తున్నాడు. వానాకాలం సీజన్ ప్రారంభం కావడంతో తన సోదరుడితో కలిసి బోరుకు మోటరు బిగించి నారుమడికి నీరు పెట్టేందుకు సోమవారం పొలం వద్దకు వెళ్లాడు. పొలంలో ఒక విద్యుత్ స్తంభం విరిగిపోగా, దాని స్థానంలో మరో కొత్త స్తంభం పాతాడు. విద్యుత్ సరఫరా నిమిత్తం తన ఇద్దరు సోదరులతో కలిసి మరో ఇద్దరు రైతుల సహకారంతో కొత్తగా వేసిన స్తంభానికి వైర్లు లాగుతున్నారు. ఈ క్రమంలో పైనున్న హైటెన్షన్ వైరుకు తగిలి నాగరాజుకు విద్యుదాఘాతంతో అక్కడికక్కడే మృతిచెందాడు. నాగరాజు పడిపోవడంతో మిగితా వారు వైరును వదిలేశారు. దీంతో వారు ప్రమాదం నుంచి బయటపడ్డారు. 108కు ఫోన్ చేసి అంబులెన్స్‌లో మృతదేహాన్ని హుజూర్‌నగర్ ఏరియా ఆస్పత్రికి తరలించగా, పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతిచెందినట్లు నిర్ధారించారు. నాగరాజుకు భార్య, కుమార్తె, కుమారుడు ఉన్నారు. ఈ ఘటనపై తమకు ఫిర్యాదు అందలేదని ఎస్‌ఐ ఈట సైదులు తెలిపారు.


కోడి నాగరాజు

రైతులు సొంత నిర్ణయాలు తీసుకోవద్దు: నగేష్, విద్యుత్ ఏఈ

పొలంలో విద్యుత్ స్తంభం మార్చి వైర్లు లాగుతున్నట్లు రైతులు రైతులు తమకు ఎలాంటి సమాచారం ఇవ్వలేదని విద్యుత్ ఏఈ రాయిరాల నగేష్ తెలిపారు. రైతులే సొంతంగా స్తంభం తెచ్చుకొని వైర్లు బిగించినట్లు తెలిసిందన్నారు. వ్యవసాయ పొలాల వద్ద విద్యుత్ సమస్యలు ఉంటే తమను సంప్రదించాలని,ఎలాంటి సొంత నిర్ణయాలు తీసుకోవద్దని కోరారు.

ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్‌గా ప్రీతం

మోత్కూరు, జూలై 8: యాదాద్రి భువనగిరి జిల్లా మోత్కూరుకు చెందిన నాగరిగారి ప్రీతం ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్‌గా నియమితులయ్యారు. ఈ ఏడాది మార్చి 17నే నియమించినా పార్లమెంటు ఎన్నికల కోడ్ అమలులోకి రావడంతో అప్పట్లో ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయలేదు.

విధేయతకు దక్కిన ఫలితం

ప్రీతం రెండు దశాబ్దాలకు పైగా కాంగ్రెస్ పార్టీకి విధేయునిగా ఉన్నారు. ఆయన కాంగ్రెస్ ఎస్సీ విభాగం రాష్ట్ర అధ్యక్షుడిగా పనిచేస్తున్నారు. ఆయన 2014, 2018, 2023 అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా తుంగతుర్తి నియోజకవర్గం కాంగ్రెస్ టికెట్ కోసం పోటీపడినా టికెట్ దక్కలేదు. 2021 జూన్‌లో అడ్డగూడూరులో జరిగిన మరియమ్మ లాకప్‌డెత్ సంఘటనపై పోరాడారు. అప్పటి అసెంబ్లీలో కాంగ్రెస్ పక్షనేత భట్టి విక్రమార్కతో కలిసి బాధిత కుటుంబానికి తగిన ఎక్స్‌గ్రేషియా, కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇప్పించి, ఆ సంఘటనకు కారకులైన ఎస్ఐని, ఇద్దరు కానిస్టేబుళ్లను ఉద్యోగాల నుంచి తొలగించే వరకు వదల్లేదు. ఎంఏ ఎల్ఎల్‌బీ చేసిన ప్రీతం 2005నుంచి కాంగ్రెస్ పార్టీలో వివిధ హోదాల్లో పనిచేశారు. 2019 పార్లమెంటు ఎన్నికల సందర్భంగా రాహుల్‌గాంధీ ఏర్పాటు చేసిన ఎల్‌డీఎమ్మార్సీలో దేశవ్యాప్తంగా 50 ఎస్సీ రిజర్వ్‌డ్ పార్లమెంటు స్థానాలకు ఇన్‌చార్జిగా పనిచేశారు. 2020 నుంచి టీపీసీసీ ఎస్సీ విభాగం చైర్మన్‌గా, 2023 నుంచి ఏఐసీసీ సభ్యుడిగా ఉన్నారు.

ఉద్యమ నేతకు దక్కిన గౌరవం

ఆలేరు రూరల్, జూలై 8: మహిళా సహకార అభివృద్ధి సంస్థ (రాష్ట్ర మహిళా కోఆపరేటివ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్) చైర్‌పర్సన్‌గా యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరుకు చెందిన బండ్రు శోభారాణి సోమవారం బాధ్యతలు చేపట్టారు. 1972 జూలై 20వ తేదీన మెదక్ జిల్లా రామాయంపేటలో జన్మించిన శోభారాణి ఆలేరుకు చెందిన బండ్రు భాస్కర్‌ను జనశక్తి ఉద్యమ పార్టీలో పనిచేస్తున్న క్రమంలోనే వివాహం చేసుకున్నారు. 1985లో ఆమె సీపీఐఎంఎల్ జనశక్తి పార్టీలో పనిచేశారు. మావోయిస్టుగా ఉన్న ఆమె 2001లో నారాయణపేట జడ్పీటీసీ స్థానానికి స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేసి రాజకీయ రంగంలోకి అడుగుపెట్టారు. 2002 నుంచి 2004 వరకు బీఆర్ఎస్ మహిళా విభాగం రాష్ట్ర అధ్యక్షురాలిగా పనిచేశారు. 2005లో టీడీపీలో చేరి ఆ పార్టీలో మహిళా విభాగం రాష్ట్ర అధ్యక్షురాలిగా, అధికార ప్రతినిధిగా పని చేశారు. ప్రొఫెసర్ జయశంకర్ మార్గదర్శకం చేసిన తెలంగాణ ఐక్య వేదికలో కీలక పాత్ర పోషించారు. అనంతరం బీజేపీలో చేరిన ఆమె 2022 డిసెంబరులో కాంగ్రెస్ పార్టీలో చేరి టీపీసీసీ ఉపాధ్యక్షురాలిగా ఉన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజలకు మెరుగైన సేవ చేయడంతో పాటు ప్రజలందరిలో ఐక్యతను పెంపొందించడమే తన ముందున్న లక్ష్యమన్నారు.

పర్యాటక అభివృద్ధి సంస్థ చైర్మన్‌గా రమేష్‌రెడ్డి

సూర్యాపేటటౌన్, జూలై 8: తెలంగాణ రాష్ట్ర పర్యాటక అభివృద్ధి సంస్థ చైర్మన్‌గా పటేల్ రమేష్‌రెడ్డి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ పర్యాటక రంగాన్ని అభివృద్ధి చేయడంలో తనవంతు కృషి చేస్తానని తెలిపారు. పర్యాటక కేంద్రాలపై ప్రత్యేక దృష్టిసారించి మౌళిక సౌకర్యాలు కల్పించడంతో పాటు పర్యాటకులకు మరింత మెరుగైన సౌకర్యాలు కల్పిస్తామని తెలిపారు.

రాజకీయ నేపథ్యం : 1995లో బాలెంల సర్పంచ్, 2001లో బాలెంల ఎంపీటీసీ, 2006లో భార్య లావణ్య జడ్పీటీసీగా ఎన్నికయ్యారు.

పదవులు: 2000-2012 వరకు టీడీపీ మండల అధ్యక్షుడు, 2012 నుండి 2014వరకు సూర్యాపేట నియోజకవర్గ ఇంచార్జీ, 2014లో ఎమ్మెల్యేగా ఎన్నికల్లో పోటీ, 2016-2017 వరకు టీడీపీ జిల్లా అధ్యకుడిగా పని చేశారు. 2017లో కాంగ్రెస్ పార్టీలో చేరిక. 2018లో టీపీసీసీ రాష్ట్ర కార్యదర్శి, 2022లో టీపీసీసీరాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా నియామకం.

నిరుద్యోగులకు బాసటగా నిలిచిన వీరయ్య

హుజూర్‌నగర్, జూలై 8: హుజూర్‌నగర్ నియోజకవర్గంలోని గరిడేపల్లి మండలం కట్టవారిగూడెంకు చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకుడు ముత్తినేని వీరయ్య వికలాంగుల కోఆపరేటివ్ కార్పొరేషన్ చైర్మన్‌గా నియమితులయ్యారు. ముత్తినేని వీరయ్య 2014 నుండి నేటివరకు కాంగ్రెస్ పార్టీ వికలాంగుల సంఘం సెల్ రాష్ట్ర చైర్మన్‌గా ఉన్నారు. గరిడేపల్లి మండలం కట్టవారిగూడెంకు చెందిన గురవయ్య, భారతమ్మల ప్రథమ కుమారుడైన వీరయ్య మిర్యాలగూడ, హైద్రాబాద్‌లలో శ్రీరామనుజన్ ఐఏఎస్ స్టడీ సర్కిల్ ద్వారా ఎంతోమంది నిరుద్యోగులకు శిక్షణ ఇప్పించారు. వీరయ్యకు భార్య మాధవి, కుమార్తె శ్రీవత్సల, కుమారుడు ఈశ్వరచంద్రవరప్రసాద్ ఉన్నారు. అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా రాష్ట్రంలోని అనేక నియోజకవర్గాల్లో పర్యటన చేశారు. విజయసంకల్ప యాత్ర టూర్ ద్వారా రాష్ట్ర వ్యాప్తంగా అనేక పార్లమెంట్ స్థానాల్లో 46రోజుల పాటు ప్రచారం నిర్వహించారు. వితంతువులు, కల్లుగీత కార్మికులు, పెరిక కులస్తులు, నిరుద్యోగులను ఏకం చేసి కాంగ్రెస్ పార్టీ విజయానికి వీరయ్య తనవంతు పాత్ర పోషించారు. రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ వికలాంగుల సెల్ అధ్యక్షుడిగా ఉన్న ముత్తినేని వీరయ్యను కార్పొరేషన్ చైర్మన్‌గా నియమించారు. బుధవారం ఆయన పదవీ బాధ్యతలు చేపట్టనున్నారు.

కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని ముత్తినేని వీరయ్య అన్నారు. కాంగ్రెస్ పార్టీ తనపై ఎంతో నమ్మకంతో పెద్ద బాధ్యతను అప్పగించిందన్నారు. తన నియామకానికి సహకరించిన సీఎం రేవంత్‌రెడ్డి, ఉమ్మడి జిల్లా మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, కోమటిరెడ్డి వెంకటరెడ్డిలతో పాటు రాష్ట్ర నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు.

ఉమ్మడి నల్లగొండలో ట్రైనీ ఐఏఎస్‌ల బృందం పర్యటన

పోచంపల్లి, బుద్ధవనం సందర్శన


స్వామి రామానందతీర్థ గ్రామీణ సంస్థలోని ట్రేడులను పరిశీలిస్తున్న ట్రైనీ ఐఏఎస్ అధికారుల బృందం

నాగార్జునసాగర్, భూదాన్‌పోచంపల్లి, జూలై 8: ఉమ్మడి నల్లగొండ జిల్లాలోని భూదాన్‌పోచంపల్లి, నాగార్జునసాగర్‌ను తెలంగాణ కేడర్‌కు చెందిన ట్రైనీ ఐఏఎస్ (అసిస్టెంట్ కలెక్టర్)లు సోమవారం సందర్శించారు. తెలంగాణ దర్శన్‌లో భాగంగా మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి సంస్థ డైరెక్టర్ జనరల్ డాక్టర్ శశాంక్ ఆదేశాల మేరకు శిక్షణలో భాగంగా క్షేత్ర పర్యటన నిమిత్తం వారు జిల్లాలో పర్యటించారు. బృందంలో ఉమాహారతి (వికారాబాద్), గరిమ నరుల (నారాయణపేట్), మనోజ్ (సంగారెడ్డి), సంకేత (నిజామాబాద్), మృణశ్రేష్ఠ (ఖమ్మం), అభిజ్ఞాన్ మాలవియా (ఆదిలాబాద్), అజయ్‌యాదవ్ (కరీంనగర్) ఉన్నారు. స్వామి రామానందతీర్థ గ్రామీణ సంస్థలో నిర్వహిస్తున్న ఉపాధి, ఉద్యోగ కల్పన కోర్సులను వారు పరిశీలించారు. అనంతరం పట్టణంలోని చేనేత మగ్గాలను సందర్శించారు. ప్రభుత్వం ద్వారా పొందే పథకాలపై వారు అవగాహన పొందారు. అనంతరం శ్రీరంజన్ సిల్క్ యూనిట్ సందర్శించారు. యూనిట్‌లోని లీవ్ టు క్లాత్ ప్రాసెసింగ్ విధానాలను వారు పరిశీలించారు. పోచంపల్లిలో మండల ప్రత్యేకాధికారి, జిల్లా చేనేత, జౌళిశాఖ ఏడీ విద్యాసాగర్, ఎస్ఆర్‌టీఆర్ఐ సంస్థ డైరెక్టర్ పీఎస్ఎస్ఆర్ లక్ష్మి, తహసీల్దార్ శ్రీకాంత్‌రెడ్డి, ఎంపీడీవో రాపర్తి భాస్కర్, ఆర్ఐ వెంకట్‌రెడ్డి వారికి మార్గదర్శనం చేశారు. సాగర్‌ను సందర్శించిన ట్రైనీ ఐఏఎస్‌ల బృందానికి ప్రొటోకాల్ డిప్యూటీ తహసీల్దార్ శరత్‌చంద్ర, ఆర్ఐ శ్రీనివాస్‌రెడ్డిలు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా వారు బుద్ధవనంలోని బుద్ధుని పాదాల వద్ద పుష్పాంజలి ఘటించారు. అనంతరం బుద్ధ చరితవనం, మహాస్తూపాన్ని సందర్శించి ఆధ్యాత్మిక అనుభూతిని పొందారు. బుద్ధవనం విశేషాలను పర్యాటక శాఖ గైడ్ సత్యనారాయణ వివరించారు. సోమవారం రాత్రి సాగర్‌లోనే బస చేయనున్న అధికారుల బృందం మంగళవారం నాగార్జునసాగర్ డ్యాం, టూరిజం లాంచీలో నాగార్జునకొండ మ్యూజియాన్ని సందర్శించనున్నారు.

హైదరాబాద్ నగరానికి సమీపంలో ఉన్న చౌటుప్పల్ పట్టణ శివారులో ఏర్పాటు చేయనున్న ఆర్‌ఆర్‌ఆర్ ఇంటర్ చేంజ్ జంక్షన్ మణిహారంగా నిలవనుంది. ఆర్‌ఆర్‌ఆర్ లోపలి భాగంలో పట్టణం ఉండడంతో కొత్త శోభను సంతరించుకోనుంది. సంవత్సర కాలంలో పట్టణ రూపు రేఖ మారనున్నాయి. హైదరాబాద్-విజయవాడ 65నంబరు జాతీయ రహదారిపై ఏర్పాటు జరగనున్న ఈ జంక్షన్ అత్యంత ప్రాధాన్యం సంతరించుకుంది. - చౌటుప్పల్ టౌన్

చౌటుప్పల్ పట్టణానికి మహర్దశ



చౌటుప్పల్ పట్టణం వ్యూ

- ప్రధాన రోడ్ల విస్తరణ
- ఫ్లై ఓవర్ నిర్మాణం
- ఆర్‌ఆర్‌ఆర్ ఇంటర్ ఛేంజ్ జంక్షన్ ఏర్పాటు

యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ పట్టణానికి మహర్దశ పట్టనుంది. హైదరాబాద్ నగరానికి సమీపంలో ఉన్న ఈ పట్టణం అత్యంత ప్రాధా న్యం సంతరించుకుంది. సంవత్సర కాలంలో పట్టణ రూపు రేఖ మారనున్నాయి. 60 నుంచి 70వేల మంది నివసించే ఈ పట్టణం అనేక మండలాలకు కూడలి ప్రాంతం కావడంతో నిత్యం 10నుంచి 15 వేల మంది వివిధ పనుల మీద వచ్చి వెళుతుంటారు. అందుకు అనుగుణంగా రవాణా సౌకర్యాలను మెరుగుపరిచేందుకు పట్టణంలోని ప్రధాన రోడ్లను విస్తరించేందుకు మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి సహకారంతో మునిసిపల్ చైర్మన్ వెన్‌రెడ్డి రాజు ప్రణాళికాబద్ధంగా ముందుకు వెళుతున్నారు. జాతీయ రహదారిపై నిత్యంజరిగే ప్రమాదాల నివారణకు ఫ్లైఓవర్‌ను నిర్మించేందుకు రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి తగిన చర్యలను చేపట్టారు. అందుకు అవసరమైన నిధులు రూ.114 కోట్లను కేంద్ర ప్రభుత్వం నుంచి మంజూరు చేయించారు. టెండర్ ఖరారు అయినందున త్వరలోనే పనులను ప్రారంభించే అవకాశాలు ఉన్నాయి. కేంద్ర ఉపరితల రవాణాశాఖ మంత్రి నితిన్ గడ్కరీతో ఫ్లై ఓవర్ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేయించేందుకు మంత్రి వెంకటరెడ్డి ప్రయత్నాలు చేస్తుండడంతో కొంత ఆలస్యం జరుగుతోంది. పట్టణ శివారులో ఏర్పాటు చేయనున్న ఆర్‌ఆర్‌ఆర్ ఇంటర్ చేంజ్ జంక్షన్ మణిహారంగా నిలవనుంది. ఆర్‌ఆర్‌ఆర్ లోపలి భాగంలో పట్టణం ఉండడంతో కొత్త శోభను సంతరించుకోనుంది.

చిన్నకొండూరు రోడ్డు విస్తరణకు చర్యలు

చౌటుప్పల్ పట్టణంలోని హైవే నుంచి జడ్పీహెచ్ఎస్ వరకు ఒక కి. మీటరు పొడవునా చిన్నకొండూరు రోడ్డును 66 అడుగుల వెడల్పుతో విస్తరించేందుకు ఆర్‌అండ్‌బీ అధికారులు చర్యలు చేపట్టారు. విస్తరణకు సంబంధించి ఇప్పటికే ఆస్తులకు మార్కింగ్ చేసిన అధికారులు త్వరలోనే కట్టడాల కూల్చివేతలను చేపట్టనున్నారు. మొదటి విడతలో హైవే నుంచి సీతారామచంద్ర స్వామి ఆలయం వరకు 350మీటర్ల పొడవునా విస్తరించనున్నారు. ప్రస్తుతం ఉన్న ఏడు మీటర్ల సీసీ రోడ్డుకు అదనంగా మరో ఏడు మీటర్ల రోడ్డును నిర్మించనున్నారు. రెండు వైపుల నుంచి మురుగు కాలువల నిర్మాణాన్ని చేపడతారు. రోడ్డు విస్తరణను చేపట్టాలని కోరుతూ 2023 అక్టోబరు 3వ తేదీన జరిగిన మునిసిపల్ సమావేశంలో తీర్మానించారు. ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకుని రోడ్డు విస్తరణను చేపట్టాలని చైర్మన్ వెన్‌రెడ్డి రాజు అధ్యక్షతన జరిగిన సమావేశంలో కౌన్సిలర్లు నిర్ణయించారు. చౌటుప్పల్ పట్టణం నుంచి వలిగొండ మండలం సంగెం గ్రామం వరకు ఆర్‌అండ్‌బీ రోడ్డు విస్తరణ చేపట్టేందుకు కేంద్ర ప్రభుత్వం రూ.18కోట్లను విడుదల చేసింది. ఈ నిధుల నుంచే రోడ్డు విస్తరణ పనులు జరుగుతున్నాయి.

లింగారెడ్డి గూడెం రోడ్డు

పట్టణంలోని హైవే నుంచి లింగారెడ్డి గూడెం రోడ్డును 1.4కి. మీటర్ల పొడవును నాలుగు వరసల(14 మీటర్లు) బీటీ రోడ్డుగా మార్చేందుకు రూ.10 కోట్లను ప్రభుత్వం మంజూరు చేసింది. ఈ రోడ్డులో ప్రమాదాల నివారణకు డివైడర్‌ను ఏర్పాటు చేయనున్నారు. తాళ్లసింగారం క్రాస్ రోడ్డు వరకు నాలుగు వరసల రోడ్డు నిర్మా ణం జరగనుంది. ఇక్కడి నుంచి పట్టణంలోని బీసీ కాలనీ వరకు కిలోమీటరు పొడవున నిర్మాణం జరుగుతున్న బీటీ రోడ్డును డబుల్ రోడ్డుగా మార్చాలని మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి సంబంధిత అధికారులకు సూచించారు. అందుకు అవసరమైన నిధులను ప్రభుత్వం నుంచి మంజూరు చేయిస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు.

రెండు ఫుట్ ఓవర్ బ్రిడ్జిల తొలగింపు

పట్టణంలో ఏర్పాటు చేయనున్న ఫ్లైఓవర్‌తో ప్రస్తుతం హైవేపై రెండు ప్రాంతాల్లోని ఫుట్ ఓవర్ బ్రిడ్జిలను తొలగించనున్నారు. హైవేను దాటేందుకు గాను పాదచారుల కోసం 2013లో అప్పటి మునుగోడు ఎమ్మెల్యే ఉజ్జిని యాదగిరి రావు ఈ ఫుట్ ఓవర్ బ్రిడ్జిలను ఏర్పాటు చేయించారు.

తంగడపల్లి రోడ్డు నాలుగు లైన్‌లుగా విస్తరణ

హైవే నుంచి తంగడపల్లి రోడ్డును ఒక కిలోమీటర్ పొడవున నాలుగు లైన్‌లుగా విస్తరించారు. 66అడుగుల వెడల్పుతో విస్తరించారు. 14 మీటర్ల వెడల్పుతో బీటీ రోడ్డు నిర్మించారు. దీంతో రవాణా సౌకర్యం ఎంతో మెరుగుపడిందని స్థానికులు పేర్కొంటున్నారు.

ఆర్‌ఆర్‌ఆర్ ఇంటర్ చేంజ్ జంక్షన్

పట్టణంలోని హైవేపై ఆర్‌ఆర్‌ఆర్ ఇంటర్ చేంజ్ జంక్షన్ ఏర్పాటు జరగనుంది. పట్టణ శివారులోని దిగువ భాగాన 55వ కిలోమీటరు రాయి నుంచి 56వ కిలోమీటరు రాయి వరకు ఈ జంక్షన్‌ను ఏర్పాటు చేయనున్నారు. ఇందుకు చౌటుప్పల్, లింగోజీగూడెం, తాళ్లసింగారం, తంగడపల్లి గ్రామాల నుంచి సుమారు 200 ఎకరాల భూమిని సేకరించాలని ఎన్‌హెచ్ఏఐ అధికారులు ప్రాథమికంగా నిర్ణయించారు. ఇందులో చౌటుప్పల్ శివారులోనే 165 ఎకరాల భూమిని సేకరించనున్నారు. 350కిలోమీటర్ల పొడవున నిర్మాణం జరిగే ఆర్‌ఆర్‌ఆర్‌కు ఈ జంక్షన్ అత్యంత కీలకంగా మారనుంది. హైదరాబాద్-విజయవాడ 65నంబరు జాతీయ రహదారిపై ఏర్పాటు జరగనున్న ఈ జంక్షన్ అత్యంత ప్రాధాన్యం సంతరించుకుంది.



చౌటుప్పల్‌లోని హైవే మీద ఫ్లై ఓవర్ నిర్మాణంతో తొలగింపునకు గురి కానున్న ఫుట్ ఓవర్ బ్రిడ్జి

మోడల్ సిటీగా చౌటుప్పల్



పట్టణంలోని ప్రధాన రోడ్ల విస్తరణ, హైవే మీద ఫ్లై ఓవర్ నిర్మాణంతో చౌటుప్పల్ రూపు రేకలు మారనున్నాయి. ప్రజలకు రవాణా సౌకర్యం మెరుగుపడనుంది. మోడల్ సిటీగా రూపుదిద్దుకోనుంది. హైవే నుంచి లింగారెడ్డి గూడెం ఆర్‌అండ్‌బీ రోడ్డు విస్తరణతో ఆస్తుల తొలగింపు అవసరం లేదు. అదే చిన్నకొండూరు రోడ్డు విస్తరణలో కొన్ని ఆస్తులను పాక్షికంగా తొలగించవలసి వస్తుంది. ఆస్తుల యజమానులకు ఎక్కువగా నష్టం జరగకుండా ఉండేందుకు రోడ్డు విస్తరణ వెడల్పును 100 అడుగుల నుంచి 66 అడుగులకు తగ్గించాం. పట్టణంలో నిర్వహిస్తున్న అభివృద్ధి పనులకు ప్రతీ ఒక్కరూ సహకరించాలి. రాష్ట్ర రోడ్లు, భవనాలశాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి సహకారంతో మునిసిపాలిటీని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తున్నాం.

- వెన్‌రెడ్డి రాజు,మునిసిపల్ చైర్మన్, చౌటుప్పల్

రోడ్ల విస్తరణతో ఎంతో మేలు



మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి సహకారంతో మునిసిపల్ చైర్మన్ వెన్‌రెడ్డి రాజు చౌటుప్పల్ పట్టణాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తున్నారు. పట్టణంలోని ప్రధానమైన రోడ్ల విస్తరణతో ప్రజల రాకపోకలకు ఎంతో మేలు జరగనుం ది. చిన్నకొండూరు రోడ్డు ఇరుకుగా ఉండడంతో వాహనదారు లు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ రోడ్డు ను త్వరితగతిన విస్తరించాలి. హైవే నుంచి లింగారెడ్డిగూడెం రోడ్డు విస్తరణకు ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి రూ.10 కోట్లు మంజూ రు చేయించడం హర్షనీయం. హైవేపై మంజూరైన ఫ్లై ఓవర్ నిర్మాణ పనులను ఎన్‌హెచ్ఏఐ అధికారులు త్వరితగతిన ప్రారంభించి, పూర్తి చేయాలి.

- రవి, చేనేత సహకార సంఘం మాజీ కార్యదర్శి,చౌటుప్పల్

హైవే ఫ్లై ఓవర్

పట్టణంలోని జాతీయ రహదారిపై 2.45కిలోమీటర్ల మీటర్ల పొడవున ఎన్‌హెచ్ఏఐ ఆధ్వర్యంలో ఫ్లైఓవర్‌ను నిర్మించనున్నారు. రూ.114కోట్లతో చేపట్టనున్న ఫ్లైఓవర్ నిర్మాణ పనులను త్వరలోనే చేపట్టనున్నారు.ఫ్లైఓవర్ నిర్మించే సమయంలో వాహనాల రాకపోకల గురించి అవసరమైన 500 మీటర్ల సర్వీస్ రోడ్డును ఏర్పాటు చేస్తున్నారు. గత నెల 20నుంచి సర్వీస్ రోడ్డ నిర్మాణ పనులు సాగుతున్నాయి. వాహనాలు, పాదచారుల రాకపోకలకు అనువుగా ఫ్లైఓవర్ డిజైన్ చేశారన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. హైవే నుంచి ఆర్డీవో కార్యాలయం వెళ్లే దారి నుంచి ఆర్‌ఆర్‌ఆర్ జంక్షన్ వరకు 2.45కిలోమీటర్ల పొడవున ఫ్లైఓవర్ నిర్మాణం జరగనుంది. ఇందులో ఆర్టీసీ బస్ స్టేషన్‌నుంచి పోలీస్ స్టేషన్ వరకు 200 మీటర్ల పొడవున ఎలివేటెడ్ కారిడార్‌ను పిల్లర్స్‌తో ఏర్పాటు చేస్తారు. మిగిలిన భాగాన్ని మట్టి కట్టతో నిర్మిస్తారు. ఈ కట్టలో వలిగొండ అడ్డ రోడ్డు వద్ద 30మీటర్లతో వాహనాల అండర్ పాస్, దీనికి పోలీస్ స్టేషన్‌కు మధ్యన భాస్కర్ టాకీస్ ఎదురుగా 3.5మీటర్ల వెడల్పుతో పాదచారులు, ద్విచక్ర వాహనాల కోసం మరోఅండర్ పాస్‌ను ఏర్పాటు చేయనున్నారు. కాగా 200 మీటర్ల ఎలివేటెడ్ కారిడార్‌లో చిన్నకొండూరు, తంగడపల్లి చౌరస్తాలు కలిసిపోవడంతో వాహనాలు, పాదాచారుల రాకపోకలకు ఎలాంటి ఇబ్బందులు ఉండవు.

రూ. 1.50 కోట్లతో ఉడాయించిన

వడ్డీ వ్యాపారి

మంత్రి కోమటిరెడ్డికి మొరపెట్టుకున్న బాధితులు



వడ్డీ వ్యాపారి నుంచి డబ్బులు ఇప్పించాలని కోరుతున్న వేములపల్లికి చెందిన బాధితులు

నల్లగొండ క్రైం, జూలై 8: అధిక వడ్డీ ఆశ చూపి సామాన్యులు, కూలీల నుంచి డబ్బులు తీసుకుని ఓ వడ్డీ వ్యాపారి ఉడాయించాడు. తమకు న్యాయం చేయాలని నల్లగొండ జిల్లా వేములపల్లి మండలానికి చెందిన కొంత మంది బాధితులు సోమవారం నల్లగొండకు వచ్చి మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డికి మొరపెట్టుకున్నారు. తాము కూలీ పనిచేసుకుని దాచుకున్న డబ్బులను మిర్యాలగూడలో నివాసం ఉంటున్న దాచేపల్లి గోవర్ధన్ 150 మంది దగ్గర మొత్తం రూ. 1.50కోట్లు తీసుకున్నాడని, ఇచ్చిన డబ్బుకు అధిక వడ్డీ ఇస్తానని చెప్పి తిరిగి ఇవ్వడంలేదని వాపోయారు. బాధితులంతా మంత్రి కోమటిరెడ్డిని కలిసి తమ గోడు చెప్పుకున్నారు. వడ్డీ వ్యాపారి నుంచి తమకు డబ్బులు ఇప్పించి న్యాయం చేయాలని మంత్రిని కోరారు. వెంటనే స్పందించిన మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి ఎస్పీ శరత్‌చంద్రపవార్, మిర్యాలగూడ డీఎస్పీతో ఫోన్‌లో మాట్లాడి వడ్డీ వ్యాపారి గోవర్ధన్‌ను వెంటనే అరెస్టు చేసి బాధితులకు న్యాయం చేయాలని సూచించారు.

శాలిగౌరారం ఎస్ఐ ప్రవీణ్‌పై

చర్యలు తీసుకోవాలి

ఎస్పీకి ఫిర్యాదు చేసిన మహిళ

డీజీపీకి సైతం ఫిర్యాదు చేసిన బాధితురాలు

నల్లగొండ క్రైం,జూలై 8 : ఓ కేసు విషయంలో తనకు న్యాయం చేయాలని పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తే అసభ్యంగా వ్యవహరించాడని ఆరోపిస్తూ ఓ మహిళ శాలిగౌరారం ఎస్ఐ వాస ప్రవీణ్‌పై ఎస్పీ శరత్ చంద్ర పవార్‌కు ఫిర్యాదు చేశారు. సోమవారం నల్లగొండ పోలీస్ కార్యాలయంలో గ్రీవెన్స్‌డే సందర్భంగా వంగమర్తి గ్రామానికి చెందిన బాధిత మహిళ జిల్లా ఎస్పీకి ఫిర్యాదు చేశారు. అనంతరం ఆమె విలేకరులతో మాట్లాడారు. శాలిగౌరారం మండలం వంగమర్తి గ్రామానికి చెందిన ఓ మహిళ రెండు నెలల రోజుల క్రితం తమ సమస్యపై శాలిగౌరారం పీఎస్‌లో ఫిర్యాదు చేసి న్యాయం చేయాలని సదరు ఎస్ఐని కోరినట్లు తెలిపారు. ఇదే అదునుగా భావించిన ఎస్ఐ ప్రవీణ్ విచారణ పేరుతో తనను స్టేషన్‌ను పిలిపించి సుమారు రెండు గంటలకు పైగా మహిళా కానిస్టేబుల్ సైతం లేకుండానే అసభ్యంగా మాట్లాడాడని ఆవేదన వ్యక్తం చేశారు. ఎస్ఐ ప్రవీణ్ ప్రత్యక్షంగా, ఫోన్‌లో అసభ్యకరంగా వ్యవహరించాడని ఆరోపించారు.

గత నెల ఫిర్యాదు చేసినా చర్యలేవీ?

ఈ విషయంపై గత నెల 24వ తేదీన ఎస్పీకి ఫిర్యాదు చేసినా నేటి వరకు ఎస్ఐ ప్రవీణ్‌పై చర్యలు తీసుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. అంతేకాక తనకు వ్యతిరేకంగా మండల పరిధిలోని కొన్ని సంఘాలతో ప్రెస్‌మీట్‌లు పెట్టించి తనను తప్పుడుగా చూపే విధంగా మానసిక వేదనకు గురి చేస్తున్నాడని ఆరోపించారు. గత నెల 25వ తేదీన హైదరాబాద్‌లో డీజీపీని సైతం కలిసి ఎస్ఐపై ఫిర్యాదు చేసినట్లు ఆమె తెలిపారు.

వన్‌టౌన్ సీఐ బాధ్యతల స్వీకరణ



నల్లగొండ క్రైం, జూలై 8: నల్లగొండ వన్‌టౌన్ సీఐగా ఏమిరెడ్డి రాజశేఖర్‌రెడ్డి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేసిన సీఐ సత్యనారాయణ సంగారెడ్డి జిల్లాకు బదిలీ అయ్యారు.

● నల్లగొండ టూటౌన్ ఎస్ఐగా పనిచేసిన రాజశేఖర్‌రెడ్డి పదోన్నతిపై హైదరాబాద్ ఇంటలిజెన్స్ సీఐగా వెళ్లారు. సాధారణ బదిలీల్లో భాగంగా వన్‌టౌన్ సీఐగా బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా రాజశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ శాంతి భద్రతల పరిరక్షణే ధ్యేయంగా జిల్లా ఎస్పీ శరత్‌చంద్రపవార్ ఆదేశాల మేరకు పని చేస్తామన్నారు.

‘మీ-సేవ’లు ఇక నగదురహితం

- పారదర్శకతకు క్యూఆర్ కోడ్‌తో చెల్లింపులు



భువనగిరి అర్బన్, జూలై 8: మీ-సేవల కేంద్రాల ద్వారా పారదర్శకంగా వినియోగాదారులకు సేవలు అందించేందుకు ప్రభుత్వం దృష్టి సారించింది. క్యూఆర్‌కోడ్ లేదా టీ-వ్యాలెట్ ద్వారా చెల్లింపులు జరిగేలా నగదు రహిత లావాదేవీలకు శ్రీకారం చుట్టింది. మీ-సేవ నిర్వాహకులు అక్రమాలకు పాల్పడకుండా ఉండేందుకు నగదు రహిత చెల్లింపులకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఈ విధానంతో నగదు మోసాలకు గురికాకుండా వినియోగదారులు, నిర్వాహకుల్లో జవాబుదారీతనం పెంపొందించేందుకు రెండు విధాల ఎంతో ఉపయోగకరంగా ఉంది.

నగదురహిత సేవలు

ఈ నెల ప్రారంభం నుంచి నగదురహిత సేవలు అందుబాటులోకి వచ్చాయి. క్యూఆర్ కోడ్, టీ-వ్యాలెట్ ద్వారా చెల్లింపులు జరిగేలా ఆన్‌లైన్‌లో రూపొందించింది. 2012 సంవత్సరం నుంచి ఈ ఏడాది జూన్ వరకు నేరుగా నగదు ద్వారానే వినియోగదారులు సేవలు పొందారు. కొంతమంది నిర్వాహకులు ఇష్టారాజ్యంగా వినియోగదారుల నుంచి అక్రమ వసూళ్లకు పాల్పడుతున్నారనే అధికారులకు అందిన ఫిర్యాదుల మేరకు ఈ కొత్త విధానం అమలులోకి తెచ్చారు.

చెల్లించాల్సిన రుసుము ఫోన్‌కు మెసేజ్

జిల్లాలో 69 కేంద్రాల ద్వారా మీ-సేవలు అందుతుండగా ప్రస్తుతం క్యూఆర్ కోడ్ ద్వారా నగదు రహిత సేవలు అందుతున్నాయి. ఆన్‌లైన్ చెల్లింపుల ద్వారా ఏ ధ్రువీకరణ పత్రం పొందేందుకు దరఖాస్తులు చేసుకున్నారో.. సంబంధిత సేవలకు సంబంధించి ప్రభుత్వం నిర్ణయించిన ధర ఫోన్లకు మెసేజీ రూపంలో చేరుతుంది. అందుకు అనుగుణంగా చెల్లింపులు చేయాల్సి ఉంటుంది. గతంలో చెల్లింపులకు సంబంధించిన వివరాలు తెలియకుండా ఉండేది. కొత్త విధానంతో అక్రమ వసూళ్లకు అడ్డుకట్ట వేసినట్టయ్యింది.

స్మార్ట్‌ఫోన్ లేనివారికోసం ఇలా..

గ్రామీణుల్లో క్యూఆర్ కోడ్ వినియోగంపై అవగాహన తక్కువగా ఉంటుంది. దీన్ని అధిగమించేందుకు ప్రతి మీ-సేవ నిర్వాహకుడికి ఫోన్ ద్వారా 10మందికి లావాదేవీలు చేసుకునేందుకు ప్రభుత్వం వీలు కల్పించింది. అంతకంటే ఎక్కువ వినియోగదారులు ఉంటే మాత్రం సేవలు నిలిచిపోనున్నాయి. ఎన్నిసార్లు అయినా వినియోగదారుడు స్కాన్ చేసుకునే అవకాశం ఉంది. గ్రామీణులు అధికంగా నగదు సేవలకు బదులు ఆన్‌లైన్ చెల్లింపుల ద్వారా లావాదేవీలు నిర్వహించడంలో ఇబ్బందులు తలెత్తనున్నాయి. దీంతో పాటు గ్రామీణుల వద్ద ముఖ్యంగా కీప్యాడ్ ఫోన్లే అధికంగా ఉండడంతో క్యూఆర్ కోడ్ ద్వారా చెల్లింపులు చేయలేని పరిస్థితులు నెలకొంటాయి. ఈ సమస్యను అధిగమించేందుకు క్యూఆర్ కోడ్‌తో పాటు నగదు లావాదేవీలను కూడా అనుమతించాల్సిన అవసరం ఉంది.

పారదర్శకంగా నగదు రహిత చెల్లింపులు

మీ-సేవల ద్వారా అందే సేవలు వినియోగదారులకు పారదర్శకంగా నగదు రహిత సేవలు అందాలి. వినియోగదారులకు ఎంత మేర చెల్లించామో తెలుసుకునే వీలుంది. క్యూఆర్ కోడ్ ద్వారా చెల్లింపులు జరిగితే అక్రమ వసూళ్లకు వీలుండదు. 10మంది వినియోగదారులకు నిర్వాహకుల ఫోన్ ద్వారా చెల్లింపులు జరిపేలా ప్రభుత్వం సూచించింది. 10 చెల్లింపుల కంటే ఎక్కువగా ఈ సంఖ్యను పెంచేందుకు ప్రభుత్వం యోచిస్తోంది. ప్రారంభంలో నగదు రహిత సేవలకు ఇబ్బందులు తలెత్తినా..ముందు ముందు సమస్య పరిష్కారం కాగలదనే నమ్మకం ఉంది.

- సాయికుమార్ (ఈడీఎం, యాదాద్రిభువనగిరి)

గురుకులంలో ఎలుకల ఘటనపై విచారణ

డిండి, జూలై 8: నల్లగొండ జిల్లా డిండి మండల కేంద్రంలోని సాంఘిక, సంక్షేమ బాలికల గురుకుల పాఠశాలలో విద్యార్థులను ఎలుకలు కొరికిన ఘటనపై దేవరకొండ ఆర్డీవో శ్రీరాములు, ఆర్సీవో అరుణకుమారి విచారణ నిర్వహించారు. ఈ నెల 2, 3, 5 తేదీల్లో వరుసగా 16 మంది విద్యార్థినులను రాత్రి వేళ నిద్రిస్తున్న సమయంలో ఎలుకలు గాయపరిచాయి. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఆర్డీవో శ్రీరాములు విద్యార్థినులు నిద్రించే గదులను పరిశీలించారు. నిద్రించే సమయంలో గది తలుపులు పూర్తిగా మూసుకునేలా తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. బాధిత విద్యార్థినులతో మాట్లాడి వివరాలు సేకరించారు. విద్యార్థినుల కోసం వండిన అన్నం ముద్ద గట్టి ఉండటాన్ని చూసి వెంటనే బియ్యాన్ని మార్చాలని సివిల్ సప్లయి డీటీసీఎస్‌ను ఆదేశించారు. ఆర్డీవో వెంట ఇన్‌చార్జి తహసీల్దార్ ముక్తార్, ఎంపీడీవో డానియెల్, ఆర్ఐ శ్యాంనాయక్ ఉన్నారు.



గురుకుల పాఠశాలలో విద్యార్థులను ఎలుకలు కరిచిన వివరాలు తెలుసుకుంటున్న ఆర్డీవో శ్రీరాములు

సమాచారం

నిత్యపూజా కైంకర్యాలు

ఉదయం 3.30 గంటలకు ఆలయాన్ని తెరుస్తారు

సుప్రభాతసేవ: ఉదయం 3.30నుంచి4వరకు
ఆరాధన: 4-4.30 వరకు, **బాలభోగం:**4.30-5.15వరకు
నిజాభిషేకం: 5.15 నుంచి 6.15 గంటల వరకు
సహస్రనామార్చనలు: 6.15నుంచి 7గంటల వరకు
రాజభోగం: 11.45నుంచి 12.30వరకు, మధ్యాహ్నం 3-4 వరకు ఆలయం మూసివేస్తారు.
తిరువారాధన:సాయంత్రం 7నుంచి7.45గంటల వరకు
సహస్రనామార్చన:రాత్రి 7.30నుంచి 8.15గంటల వరకు
ఆరగింపు: రాత్రి 9 గంటల నుంచి
శయనోత్సవ దర్శనం: 9.30- 9.45 ద్వార బంధనం
ఉచిత దర్శనం:ఉదయం 5 నుంచి 8 గంటల వరకు తిరిగి సాయంత్రం 5-7 రాత్రి 8.15-9 గంటల వరకు
వీఐపీ వేళలు:ఉదయం 9-10, సాయంత్రం 4-5వరకు..

భువనగిరి అర్బన్

చెర్వుగట్టు ఆలయ వేళలు

ఉదయం: 5.00 గంటలకు తెరుస్తారు
సుప్రభాతసేవ మరియు నాదస్వరం: ఉదయం 5.00 నుంచి 5.30 వరకు
నిజాభిషేకం: ఉదయం 5.30నుంచి 6.30గంటల వరకు
దర్శనాలు:ఉదయం 6.30గంటల నుంచి 12గంటల వరకు
నివేదన: మధ్యాహ్నం 12.00 గంటలకు మహానివేదన
దర్శనం: 12.10నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు
మూసివేత: మధ్యాహ్నం ఒంటి గంటకు మూసివేత
సాయంత్రం: 3గంటలకు తెరుచుకోనున్న ఆలయం
దర్శనాలు:సాయంత్రం 3గంటల నుంచి రాత్రి 7.30 గంటల వరకు దర్శనాలు
ద్వార బంధనం: సాయంత్రం 7.30 గంటలకు ప్రదోశకాల పూజలు మహా ఫల నివేదన, హారతి అనంతరం ద్వార బంధనం

హెల్ప్‌లైన్ నంబర్లు

దివ్యాంగులు, సీనియర్ సిటిజన్స్ సంక్షేమ శాఖ టోల్‌ఫ్రీ నెంబర్ 18005728980
నల్లగొండ : 18004251442
యాదాద్రి : 1800 425 7106
సూర్యాపేట : 1800 425 1972

మా గోడు వినేవారేరీ?

- అధికారుల చుట్టూ మత్స్యకారుల ప్రదక్షిణలు
- ఆక్రమణల నేపథ్యంలో సర్వే చేస్తామని హామీ
- రెండు నెలలుగా కదలని యంత్రాంగం
- ఇదీ నర్లకంటిగూడెం చెరువు దుస్థితి



ఒకప్పుడు సువిశాలమైన చెరువు.... 74 ఎకరాల్లో విస్తరించి, నాగార్జునసాగర్ కాల్వ నీటితో కనుచూపు మేర ఓ చిన్నపాటి సముద్రాన్ని తలపించేది. ఆ చెరువు కింద 350 ఎకరాలు రెండు పంటలు పండి సస్యశ్యామలంగా కనిపించేది. అదే చెరువును ఆసరాగా చేసుకుని చేపల పెంపకం తో సుమారు 600 మత్స్యకార్మిక కుటుంబాలు ఆధారపడి జీవించేవి. ప్రస్తుతం ఆ చెరువు కళ తప్పింది. 74 ఎకరాల్లో విస్తరించి చెరువు కబ్జాకు గురై 24 ఎకరాలకు చేరింది. దీంతో అటు ఆయకట్టు రైతులు ఆందోళన చెందుతుండగా, మరో వైపు మత్స్యకారుల జీవనం ప్రశ్నార్థకంగా మారింది. ఇదీ త్రిపురారం మండలం పెద్దదేవులపల్లి గ్రామ పంచాయతీ పరిధిలోని నర్లకంటిగూడెంలోని నర్లకుంట చెరువు దుస్థితి. - త్రిపురారం

సువిశాలమైన చెరువును కొందరు అక్రమార్కులు యథేచ్ఛగా కబ్జా చేస్తున్నారు. సుమారు 74 ఎకరాల్లో విస్తరించి ఉన్న ఓ చెరువును సమీపంలోని రైతులు సుమారు 54 ఎకరాల వరకు కబ్జా చేశారు. కుంట చుట్టూ ఉన్న రైతులు ఈ ఏడాది ఏప్రిల్ నెలలో పెద్ద కందకాలు తీసి చెరువులో మట్టి పోసి ఆక్రమణకు తెరలేపారు. కబ్జా పనులు ఎక్స్‌కవేటర్, డోజర్ ట్రాక్టర్‌తో పెద్ద ఎత్తున చేపట్టారు. దీంతో నర్లకుంట ప్రస్తుతం సుమారు 24 ఎకరాలకు కుదించుకుపోయింది. జీవనోపాధి కోల్పోతున్నామంటూ మత్స్యకారులు చెరువును కాపాడుకోవడానికి నడుం బిగించారు. ఆక్రమణను ఆపాలని కలెక్టర్‌తో పాటు అధికారులకు ఫిర్యాదులు చేశారు. ఇదిగో అదిగో అంటూ హడావుడి చేసిన అధికారులు సర్వే చేస్తామని మాట ఇచ్చారు.. ఇప్పటికి రెండు నెలలైనా సర్వే ఊసేలేదు.

అధికారులకు మత్స్యకారుల ఫిర్యాదు

నర్లకంటిగూడెం గ్రామానికి చెందిన మత్స్యకారులు చెరువు ఆక్రమణలను అడ్డుకునేందుకు నడుంబిగించారు. అంతేకాక ఏప్రిల్ 30వ తేదీన కలెక్టర్‌తో పాటు ఎన్నెస్పీ అధికారులకు లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేశారు. చెరువు ఆక్రమణపై విచారణ జరిపి హద్దులు ఏర్పాటు చేయాలని అప్పటి కలెక్టర్ హరిచందన రెవెన్యూ అధికారులను ఆదేశించగా, ఎన్నెస్పీ అధికారులు చెరువు ఆక్రమణ పనులు చేస్తున్న రైతులు, ట్రాక్టర్ డోజర్, ఎక్స్‌వేటర్ స్వాధీనం చేసుకున్నారు.

మత్స్యకారుల ప్రదక్షిణలు

రెండు నెలలుగా మత్స్యకారులు ఎన్నెస్పీ, రెవెన్యూ అధికారుల చుట్టూ తిరుగుతున్నా పట్టించుకునే వాళ్లే కరువయ్యారు. పార్లమెంట్ ఎన్నికల తర్వాత చెరువు సర్వే చేస్తామని హామీ ఇచ్చిన అధికారులు ఇప్పటి వరకు ఆ విషయాన్ని పట్టించుకోలేదు. ఆక్రమణలను తొలగించి చెరువు సర్వే చేసి హద్దులు ఏర్పాటు చేయాలని మత్స్యకారులు వేడుకుంటున్నారు.

ఆక్రమణలను అడ్డుకోవడం లేదు



చెరువు కబ్జాను తొలగించాలని అధికారుల చుట్టూ తిరుగుతున్నా వారు పట్టించుకోవడం లేదు. మొదటిలో హడావుడి చేశారు. వారం రోజుల్లో సర్వే చేస్తామన్నారు. ఇప్పటికి రెండు నెలలు గడిచింది. ఆక్రమణదారులపై చర్యలు తీసుకుంటామన్నా అదీ లేదు. కబ్జాదారులకు అధికారులు వత్తాసు పలుకుతున్నారు. మా గోడు వినేవారే లేరు.

- సింగం ముత్తయ్య, మత్స్య పారిశ్రామిక సహకార సంఘం అధ్యక్షుడు

సర్వేయర్ ఖాళీగా లేదు

రెవెన్యూ అధికారులకు నర్లకుంట సర్వే చేయాలని లేఖ రాశాం.సర్వేయర్ ఖాళీగా లేదని వారు చెబుతున్నారు.

- కేశవ్, త్రిపురారం ఎన్ఎస్‌పీ సబ్ డివిజన్ డీఈ

కదలని యంత్రాంగం..

చెరువులో స్వాధీనం చేసుకున్న వాహనాలతో పాటు కబ్జాకు పాల్పడిన రైతులపై ఎన్నెస్పీ అధికారులు మాడ్గులపల్లి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసి మమ అనిపించారు. పోలీసులు మాత్రం ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని మత్స్యకారులు ఆరోపిస్తున్నారు. ఆ వాహనాలను అక్కడినుంచి తప్పించినట్లు గ్రామస్థులు చెబుతున్నారు. త్రిపురారం తహసీల్దార్‌కు చెరువు కుంట సర్వే చేసి హద్దులు ఏర్పాటు చేయాలని ఎన్నెస్పీ అధికారులు లేఖలు రాశారు. ఆ తర్వాత కబ్జా విషయంపై నిర్లక్ష్యం వహించారు. ఇప్పటికి రెండు నెలలైనా రెవెన్యూ అధికారులు ఎలాంటి సర్వే పనులు చేపట్టలేదు.



చెట్ల పొదల్లోకి దూసుకెళ్లిన ట్రావెల్స్ బస్సు



చెట్ల పొదల్లోకి దూసుకెళ్లిన ప్రైవేట్ బస్సును పరిశీలిస్తున్న పోలీసులు

సూర్యాపేటరూరల్, జూలై 8: అతివేగంగా వెళుతూ ముందుఉన్న వాహనాన్ని ఢీకొట్టిన ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు అదుపుతప్పి చెట్ల పొదల్లోకి దూసుకెళ్లింది. ఈ ఘటనలో ఆరుగురికి గాయాలయ్యాయి. సోమవారం సూర్యాపేట మండలం పరిధిలోని టేకుమట్ల గ్రామ సమీపంలో ఈ ప్రమాదం జరిగింది. రూరల్ ఎస్ఐ బాలునాయక్ కథనం ప్రకారం.. 10మంది ప్రయాణికులతో హైదరాబాద్ నుంచి విజయవాడకు వెళ్తున్న ఆరెకే ట్రావెల్స్ బస్సు సూర్యాపేట జిల్లా సూర్యాపేట మండలం టేకు మట్ల సమీపంలోకి రాగానే అతి వేగంతో ముందు వెళ్తున్న బొలెరో వాహనాన్ని ఢీకొనటంతో, అది వెళ్తున్న కారును ఢీకొంది. అతి వేగంతో ఉన్న బస్సు అదుపుతప్పి రోడ్డు వెంటఉన్న చెట్ల పొదల్లోకి దూసుకెళ్లి ఆగిపోయింది. ఈ ప్రమాదంలో బొలెరో వాహన డ్రైవర్ కల్లెపల్లి నవీన్, బస్సులోని ప్రయాణికులు నందిగామ విజయ్, కంపాటి, అఖిల్, కాంపాటి శైలజ, కట్ల సోమయ్యలకు స్వల్పంగా గాయాలయ్యాయి. క్షతగాత్రులను వెంటనే సూర్యాపేట ఏరియా ఆసుపత్రికి తరలించి చికిత్స చేస్తున్నారు. బొలెరో వాహనంలో ఐదుగురు, కారులో ముగ్గురు ప్రయాణిస్తున్నారు. పెనుప్రమాదం తప్పడంతో ప్రయాణికులు ఊపిరి పీల్చుకున్నారు. బొలెరో వాహన డ్రైవర్ నవీన్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ఒకరి ఇల్లు మరొకరికి మ్యుటేషన్

నాగారం, జూలై 8: ఓ ఇంటి యాజమాని పేరున ఉన్న ఇల్లు మరొకరి పేరున రిజిస్ట్రేషన్ అయింది. ఆ ఇంటి పైనే ఓ ప్రైవేట్ బ్యాంకులో రూ.7 లక్షల రుణం తీసుకున్నారు. ఈ సంఘటన మండలంలోని నాగారం బంగ్లా గ్రామంలో జరి గింది. గ్రామానికి చెందిన సమాచార హక్కు వికాస సమితి జిల్లా అధ్యకుడు గుంటకండ్ల ముకుందారెడ్డికి గ్రామంలో ఇంటి నెం: 5-7 గల ఇల్లు ఉంది. 30 ఏళ్లకుపైగా నివాసముంటున్నాడు. వారం రోజుల క్రితం తన ఇంటి ఆసెస్‌మెంట్ ప్రతి తీసుకోవడానికి పంచాయతీ కార్యదర్శిని కలిశారు. ఈ పంచాయతీ వెబ్ సైట్‌లో ప్రింట్ తీసి ఇచ్చారు. ఇంటి నెం: 5-7గల ఇల్లు నాగారం గ్రామానికి చెందిన జాజుల మరియమ్మ పేరు రావడంతో ఇంటి యాజమాని ముకుందారెడ్డి ఆశ్చర్యానికి గుయ్యాడు. తన పేరున ఉన్న ఇల్లు ఎలా రిజిస్ట్రేషన్ చేయించుకుంటావని ముకుందారెడ్డి మరియమ్మను నిలదీయడంతో అసలు విషయం బయటపడింది. మరియమ్మ భర్త మంగయ్య(యోహాను) నాగారం పంచాయతీలో తన పేరున ఇంటి నెం 5-7 గల ఇంటిని తన భార్య పేరున సూర్యాపేట రిజిస్ట్రేషన్ కార్యాలయంలో డాక్యుమెంట్ నెం 4278/24 మార్చి నెలలో రిజిస్ట్రేషన్ చేయించారు. రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్‌పై ఓ ప్రైవేట్ సంస్థలో రూ.7 లక్షల రుణం తీసుకున్నట్లు మరియమ్మ చెప్పారని బాధితుడు తెలిపారు. మరియమ్మ పేరున ఉన్న డాక్యుమెంట్‌ను ముకుందారెడ్డి తీసుకొని సూర్యాపేట సబ్ రిజిస్టర్ కార్యాలయానికి వెళ్లి అడగగా డాక్యుమెంట్‌ను పరిశీలించిన సబ్ రిజిష్టార్ అధికారులు మ్యుటేషన్ సమయంలో నాగారం గ్రామపంచాయతీలో జాజుల మంగయ్య పేరున ఉన్న ఇంటి నెం 5-7కు బదులుగా నాగారం బంగ్లా గ్రామపంచాయతీలో నమోదైన గుంటకుండ్ల ముకుందారెడ్డి పేరున ఉన్న ఇంటి నెం 5-7ను జాజుల మరియమ్మకు మ్యుటేషన్ చేసినట్లు గుర్తించారు. మ్యుటేషన్‌లో తప్పులను సవరించి వారంలోపు నాగారం బంగ్లాలో ఉన్న ఇంటినెం 5-7 తన పేరున వచ్చేవిధంగా చేస్తామని అధికారులు చెప్పారని బాధితుడు ముకుందారెడ్డి తెలిపారు. 15రోజులైనా మార్చకుండా కాలయాపన చేస్తున్నారని ఆరోపించారు.

విశ్రాంత ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

కోదాడ, జూలై 8: విశ్రాంత ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని విశ్రాంత ఉద్యోగుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు రావేళ్ల సీతారామయ్య కోరారు. కోదాడ పట్టణంలోని పెన్షనర్స్ భవనంలో సోమవారం జరిగిన సమావేశంలో మాట్లాడారు. ప్రభుత్వం ఏర్పాటై ఎనిమిది నెలలు గడుస్తున్నా పెండింగ్‌లో ఉన్న నాలుగు డీఏలు, పీఆర్సీ అమలు, హెల్త్‌కార్డు సమస్యలు పరిష్కరించలేదన్నారు. కార్యక్రమంలో వేనేపల్లి శ్రీనివాసరావు, వై. లక్ష్మీనరసయ్య, అమృతరెడ్డి, బొల్లు రాంబాబు, గడ్డం నరసయ్య, విద్యాసాగర్, భ్రమరాంబ, రఘు పాల్గొన్నారు.

'ఎవరికీ అతిసార లక్షణాలు లేవు'

మఠంపల్లి, జూలై 8: మండలంలోని రఘునాథపాలెం గ్రామంలో ఎవరికీ అతిసార వ్యాధి లక్షణాలు లేవని మండల వైద్యాధికారి డాక్టర్ సుధాకర్‌నాయక్ తెలిపారు. సోమవారం గ్రామంలో ఇంటింటి సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామానికి చెందిన వ్యక్తి అతిసార వ్యాధితో చనిపోయి ఉండవచ్చని అనుమానంతో గ్రామస్థులు ఆదివారం డీఎంహెచ్‌వోకు ఫిర్యాదు చేశారని తెలిపారు. వైద్య సిబ్బంది గ్రామంలో ఇంటింటికి వెళ్లి నిర్వహించారని తెలిపారు. రామాలయ కాలనీలో 20ఇల్లు సర్వే చేయగా ఆరుగురు విరేచనాలతో బాధ పడుతున్నారని గుర్తించామని, ఇది కూడా పరిసరాలు పరిశుభ్రంగా లేకపోవడం, తాగునీరు సరిగా లేకపోవడమే కారణమన్నారు.

వేతనాలు చెల్లించాలని ఉద్యోగుల నిరసన

నూతన్‌కల్, జూలై 8: మిషన్ భగీరథలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ ఉద్యోగులకు ఐదు నెలలుగా వేతనాలు రావడం లేదని మండల పరిధిలోని చిల్పకుంట్ల గ్రామంలో గల మిషన్ భగీరథప్లాంట్ వద్ద సోమవారం నిరసన తెలిపారు. వేతనాలు సకాలంలో ఇవ్వకపోవడంతో కుటుంబాల పోషణ భారంగా మారిందని వాపోయారు. అధికారులు స్పందించి వేతనాలు ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో ఉప్పలయ్య, గోపాల్, రామకృష్ణ, వెంకన్న, సతీష్ తదితరులు ఉన్నారు.

56 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టివేత

మఠంపల్లి, చిలుకూరు, జూలై 8: సూర్యాపేట జిల్లాలో వేర్వేరు చోట్ల నిల్వ ఉంచిన 56క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని పోలీసులు పట్టుకున్నారు. మఠంపల్లి మండల కేంద్రంలోని వంగవేటి రామయ్య ఇంట్లో 15క్వింటాళ్లు, తవనం శ్రీనివాస్‌రెడ్డి ఇంట్లో 20క్వింటాళ్ల బియ్యాన్నిస్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ రామాంజనేయులు తెలిపారు. ఇద్దరిపై కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నట్లు తెలిపారు. అదే విధంగా చిలుకూరు మండలంలోని దూద్యాతండాలో నిల్వచేసిన 16 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. దూద్యాతండా గ్రామంలోని ప్రాథమిక పాఠశాల సమీపంలోని స్వామి ఇంట్లో నారాయణపురం గ్రామానికి చెందిన చర్ల సహదేవ్ రేషన్ బియ్యాన్ని అక్రమంగా నిల్వ చేసినట్లు విశ్వసనీయ సమాచారం మేరకు పోలీసులు దాడి చేశారు. 33 బస్తాల్లో ఉన్న 16 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని సీజ్ చేసి పౌరసరఫరాల అధికారులకు అప్పగించి, సహదేవ్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ రాంబాబు తెలిపారు.

ఆశా వర్కర్ల సమస్యలు పరిష్కరించాలి

సూర్యాపేట(కలెక్టరేట్), జూలై 8: ఆశా వర్కర్లు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించాలని ఆశా వర్కర్ల యూనియన్ రాష్ట్ర నాయకురాలు కళమ్మ కోరారు. సంఘం ఆధ్వర్యంలో కలెక్టర్ తేజస్ నందలాల్‌పవార్‌కు సోమవారం వినతిపత్రం అందజేశారు. ఆశా వర్కర్లకు నెలకు రూ.18వేల వేతనం ఇవ్వాలన్నారు. మేజర్ గ్రామపంచాయతీల్లో జనాభాకు అనుగుణంగా అదనంగా ఆశా వర్కర్లను నియమించాలన్నారు. ఈ కార్యక్రమంలో సీత, విజయ, సుజాత, సునీత, సుశీల, మహేశ్వరి, శోభ, జయమ్మ, మాధవి, హేమలత ఉన్నారు.

పేదల గుడిసెలపై సర్వే

● బైపాస్ పక్కన ప్రభుత్వ భూమిలో గుడిసెలు వేసుకున్న పేదలు ● వివరాలు సేకరించిన రెవెన్యూ అధికారులు

నేరేడుచర్ల, జూలై 8: నేరేడుచర్ల పట్టణంలోని మిర్యాలగూడ రోడ్డు బైపాస్ పక్కన ఉన్న ప్రభుత్వ భూమి 243, 244 సర్వే నెంబర్లలో గుడిసెలు వేసుకున్న వారి వివరాలను అధికారులు సోమవారం సేకరించారు. ఆర్ఐ నర్సయ్య ఆధ్వర్యంలో రెవెన్యూ సిబ్బంది వివరాలు సేకరించారు. ఇళ్లు లేని పేదలకు ఇళ్ల స్థలాలు ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్నామని ప్రభుత్వం ప్రకటించిన నేపథ్యంలో ఇప్పటి వరకు ఇక్కడ ప్రభుత్వ స్థలంలో ఎంత మంది గుడిసెలు వేసుకున్నారనేది సమాచారం స్వీకరిస్తున్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో గుడిసెలు వేయడంతో ప్రభుత్వ అధికారులు తొలగించారు. ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం రాగానే తిరిగి మళ్లీ గుడిసెలు వేశారు. ప్రస్తుతం 251 కుటుంబాల వారు ప్రభుత్వ స్థలంలో గుడిసెలు వేసుకున్నారు. దీంతో అధికారులు పూర్తిస్థాయి నివేదిక ఇవ్వాలని ఆదేశాలు రావడంతో వివరాలు సేకరిస్తున్నారు. పట్టణ పరిధిలోని శాంతినగర్ సమీపంలో ఉన్న సుమారు 11ఎకరాల ప్రభుత్వ భూమిని ఆటోనగర్‌కు కేటాయించారు. ఆటోనగర్ వాసులకు ప్రభుత్వం కేటాయించడంతో ఇండస్ట్రియల్ శాఖ ఇప్పటికే అందులో ప్లాట్లు నిర్మాణం చేసేందుకు రహదారులు వేశారు. కాని అందులో ప్లాట్లు ప్రభుత్వ ధర ప్రకారం ఆటోనగర్ వాసులు కొనుగోలు చేసేందుకు సిద్ధంగా లేకపోవడంతో, వాటిని రద్దు చేసి పేదలకు ఇళ్ల స్థలాలు పంపిణీ చేసేందుకు అధికారులు సిద్ధమతున్నారు. ఈ విషయాన్ని మున్సిపల్ సమీక్షా సమావేశంలో పలువురు మంత్రిఉత్తమ్ దృష్టికి తీసుకు రావడంతో కౌన్సిలర్లు తీర్మానం చేస్తే అందుకు అనుగుణంగా ప్రభుత్వం నుంచి అనుమతి వచ్చేలా చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. దీంతో ఆ భూమిని పేదలకు పంచేందుకు మున్సిపాలిటీ సిద్ధంగా ఉంది. ఇప్పుడు వేసుకున్న స్థలాలలోనే తమకు ప్లాట్లు కేటాయించాలని ఆక్రమణ దారులు పట్టుబడుతుండగా, అందరికీ ఒకే చోట ఇవ్వలేమని ప్రస్తుతం శాంతినగర్ వద్ద ప్లాట్లు కేటాయించేందుకు చర్యలు తీసుకుంటున్నామని అధికారులు చెబుతున్నారు.



గుడిసెవాసులను వివరాలు అడుగుతున్న అధికారులు

రైతులపై కేంద్ర ప్రభుత్వం నిర్లక్ష్యం విడనాడాలి

నేరేడుచర్ల, జూలై 8: కేంద్ర ప్రభుత్వం రైతాంగంపై నిర్లక్ష్య వైఖరిగా వ్యవహరిస్తుందని వ్యవసాయకార్మిక సంఘం జిల్లా కార్యదర్శి ధూళిపాళ ధనుంజయనాయుడు ఆరోపించారు. రైతాంగం ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ తహసీల్దార్ కార్యాలయంలో రైతు సంఘం ఆధ్వర్యంలో సోమవారం వినతిపత్రం అందజేశారు. ఇటీవల కేంద్ర ప్రభుత్వం 14 రకాల పంటలకు కంటి తుడుపులా మద్దతు ధర ప్రకటించి చేతులు దులుపుకుందన్నారు. స్వామినాథన్ కమిషన్ సిఫారసులు అమలు చేస్తున్నట్లు నటిస్తోందన్నారు. రైతాంగం పండించిన పంటకు గిట్టుబాటు ధరకు చట్టబద్దత కల్పించాలని దేశ వ్యాప్తంగా రైతులు అనేక ఆందోళనలు చేపట్టినప్పటికీ కేంద్రం ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందన్నారు. కార్యక్రమంలో నాయకులు రావుల సత్యం, ఊదర వెంకన్న, కొమ్మరాజు వెంకట్, ఇంజం సైదిరెడ్డి, బానోతు రాముునాయక్, శేఖర్ ఉన్నారు.

తిరుమలగిరి: కేంద్రప్రభుత్వం డాక్టర్ స్వామినాథన్ కమిషన్ సిఫారసులను అమలుచేయాలని రైతు సంఘం జిల్లా మాజీ అధ్యక్షుడు ఎల్లంల యాదగిరి డిమాండ్‌చేశారు. సోమవారం తిరుమలగిరి తహసీల్దార్ కార్యాలయంలో రైతు సంఘం ఆధ్వర్యంలో డీటీ జాన్ మహ్మద్‌కు వినతిపత్రం అందజేశారు. రైతుపండించిన పంటకు పార్లమెంట్‌లో గ్యారెంటీ చట్టం చేయాలన్నారు. కార్యక్రమంలో కనుక అశోక్, ఎండి ఫయాజ్, నాగులగాని మల్లయ్య, సత్తయ్య, జంపాల శ్రీను, నవీన్, మల్లయ్య, తదితరులు పాల్గొన్నారు.



తిరుమలగిరిలో వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

న్యాయవాదుల రక్షణకు ప్రత్యేక చట్టాలు తేవాలి

సూర్యాపేటటౌన్, జూలై 8: న్యాయవాదుల రక్షణకు ప్రత్యేక చట్టాలు తీసుకురావాలని సూర్యాపేటబార్ అసోసియేషన్ అధ్యక్షుడు నూకల సుదర్శన్‌రెడ్డి డిమాండ్ చేశారుర. జిల్లాకేంద్రంలోని బార్ అసోసియేషన్ కార్యాలయంలో సోమవారం జరిగిన సమావేశంలో మాట్లాడారు. భద్రాచలం జిల్లాకు చెందిన న్యాయవాదిని పోలీసులు సంకెళ్లతో పోలీస్‌స్టేషన్‌కు తరలించడం దారుణమన్నారు. న్యాయవా దులకు దేశంలో రక్షణ కరువైందని అన్ని వర్గాల ప్రజలకు రక్షణ చట్టాలు ఉండగా న్యాయవాదులకు ఎలాంటి రక్షణ చట్టాలు లేకుండ పోయాయన్నారు. సమావేశంలో బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి డప్పుకు మల్లయ్య, వరప్రసాద్‌రావు, కోశాధికారి వీరేష్‌కుమార్, అబ్దుల్‌లతీఫ్, సుంకరి రవి, దండ వెంకటరెడ్డి, కొంపెల్లి వెంకటేశ్వర్లు, రామరాజు, శ్రీనివాసరావు, సోమేశ్వర్, శంకర్ పాల్గొన్నారు.

కోదాడటౌన్: భద్రాచలంలో న్యాయవాదిని సంకెళ్లతో కోర్టులో హాజరుపర్చడాన్ని కోదాడ బార్ అసోసియేషన్ నాయకులు ఖండించారు. కోర్టు విధులు బహిష్కరించి నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు ఎస్. రాధాకృష్ణమూర్తి, సీనియర్ నాయకులు మేకల వెంకట్రావు, హనుమంతరావు, గట్ల నరసింహారావు, రంజాన్, పాషా, ఎడ్లవపల్లి వెంకటేశ్వర్లు, ఉదారు శ్రీను, యశ్వంత్, ముల్క వెంకటరెడ్డి, ఉయ్యాల నరసయ్య, దావీదు పాల్గొన్నారు.

హుజూర్‌నగర్: న్యాయవాది పట్ల దురుసుగా ప్రవర్తించిన పోలీసులపై చర్యలు తీసుకోవాలని హుజూర్‌నగర్ బార్ అసోసియేషన్ నాయకులు డిమాండ్ చేశారు. న్యాయవాదులు విధులు బహిష్కరించి కోర్టు ఎదుట నిరసన తెలిపారు. అనంతరం జూనియర్, సివిల్ జడ్జిలు మారుతిప్రసాద్, జిట్టా శ్యామ్‌లకు వినతిపత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి జక్కుల వీరయ్య, న్యాయవాదులు కాలువ శ్రీనివాసు, అంజయ్య, సైదులు, నగేష్, సైదా, వీరు, విశ్వనాథం, గోపి, సురేష్, వెంకటరెడ్డి, వెంకటేష్, శంకర్, రమణారెడ్డి, సంధ్య, నాగార్జున, యాదగిరి తదితరులు పాల్గొన్నారు.



కోదాడలో నిరసన తెలుపుతున్న న్యాయవాదులు

పార్టీ ఫిరాయింపులు ప్రోత్సహించడం ఆపాలి

హుజూర్‌నగర్, జూలై 8: సీఎం రేవంత్‌రెడ్డి పార్టీ ఫిరాయింపులను ప్రోత్సహించడం ఆపాలని బీఆర్ఎస్ నియోజకవర్గ కోఆర్డినేటర్ నర్సింహారెడ్డి కోరారు. సోమవారం పట్టణంలోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటుచేసిన ముఖ్యనేతల సమావేశంలో ఆయన మాట్లాడుతూ బీఆర్ఎస్ ఎమ్మెల్యేలను కాంగ్రెస్‌లో చేర్చుకోవడం సిగ్గుచేటన్నారు. రేవంత్‌రెడ్డి, చంద్రబాబునాయుడు మీటింగ్ వల్ల ఒరిగిందేమీ లేదన్నారు. ఓటుకు నోటు కేసులో ఒకరిని ఒకరు కాపాడుకునేందుకే ఈ భేటీ ఏర్పాటుచేసుకున్నారని ఆరోపించారు. సీఎంగా కేసీఆర్, జగన్మోహన్‌రెడ్డిలు ఉన్నప్పుడే విభజన అంశాలు కొలిక్కి వచ్చాయన్నారు. తెలంగాణలో ఉన్న భవనాలను ఏపీకి ఇవ్వడం సరికాదన్నారు. సమావేశంలో బెల్లంకొండ అమర్‌గౌడ్, కొప్పుల సైదిరెడ్డి, జక్కుల నాగేశ్వరరావు, పచ్చిపాల ఉపేందర్, ముల్కలపల్లి రాంబాబు, కెఎల్ఎన్‌రెడ్డి, నగేష్‌రాథోడ్, ఆలీపాషా, బిక్షం, అబ్దుల్‌నబీ, చంద్రమౌళి, కృష్ణమోహన్, వీరయ్యముదిరాజ్, వెంకన్న పాల్గొన్నారు.

నేరేడుచర్ల: తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వం అభివృద్ధిని విస్మరించి సంతలో పశువులను కొన్నట్లు బీఆర్ఎస్ ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలను చేర్చుకోవడంలోనే సరిపెడుతున్నారని హుజూర్‌నగర్ నియోజకవర్గ బీఆర్ఎస్ ఇన్‌చార్జి ఒంటెద్దు నర్సింహారెడ్డి ఆరోపించారు. నేరేడుచర్లలోని పార్టీ కార్యాలయంలో సోమవారం జరిగిన సమావేశంలో మాట్లాడారు. ఇతర రాష్ట్రాల్లో కాంగ్రెస్ ఎమ్మెల్యేలు బీజేపీలో చేరితే రాహుల్‌గాంధీ వారిని అనర్హులుగా ప్రకటించాలని కోర్టులో పిటిషన్ వేస్తారని, సొంత పార్టీ వారు తెలంగాణలో బీఆర్ఎస్ ఎమ్మెల్యేలను చేర్చుకుంటే మాత్రం నోరు మెదపడం లేదన్నారు. నేరేడుచర్ల మండలంలో పీడీఎస్ బియ్యం పట్టుకుంటే పట్టుబడ్డ వారు ఉత్తమ్ కుమార్‌రెడ్డి శిష్యులు కారా అని ఆరోపించారు. కార్యక్రమంలో టీఆర్ఎస్ మండల అధ్యక్షుడు అరిబండి సురేష్, డీసీసీబీ డైరక్టర్ దొండపాటి అప్పిరెడ్డి, నాగండ్ల శ్రీధర్, చెన్నబోయిన సైదులు, జయబాబు, లకుమళ్ల జ్యోతి, అనంతు శ్రీను, రాపోలు నవీన్, చిత్తలూరి సైదులు, చిట్యాల శ్రీను, రామస్వామి, నాగార్జున్ పాల్గొన్నారు.



హుజూర్‌నగర్‌లో మాట్లాడుతున్న బీఆర్ఎస్ నాయకుడు నర్సింహారెడ్డి

సూర్యాపేటరూరల్: పర్యాటక అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించిన పటేల్ రమేష్‌రెడ్డిని సూర్యాపేట కాంగ్రెస్ పార్టీ నాయకులు సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో డీసీసీబీ మాజీ డైరక్టర్ ముదిరెడ్డి రమణారెడ్డి, నాయకులు గట్టు శ్రీనివాస్, దరవత్ వెంకన్న నాయక్, ఎడ్ల వీరమల్లుయాదవ్, షఫీ, ఫారుక్, వేణుగోపాల్‌రెడ్డి, దేవేందర్, సైదిరెడ్డి, దర్మ తదితరులు పాల్గొన్నారు.

చివ్వెంల: మండల పరిధిలోని బండమీది చందుపట్ల గ్రామానికి కేటాయించిన మీసేవ కేంద్రాన్ని అర్హులైన వారికి కేటాయించాలని గ్రామ యువకులు మండల కేంద్రంలోని ఏపీఎం కార్యాలయంలో సీసీ రమణకు సోమవారం వినతిపత్రం అందజేశారు. గ్రామంలో అర్హులైన మహిళలు 200ల మందికి పైగా ఉన్నారని, వారి కాకుండా ఎలాంటి అర్హత లేని వారికి కేటాయించవద్దన్నారు. కార్యక్రమంలో బాష్పంగు సునీల్, గుద్దేటి మధుసూదన్, కోడి రవి, కేయ్యాల రాజ్‌కుమార్, లక్ష్మణ్ పాల్గొన్నారు.

మద్దిరాల: మండల పరిధిలోని చందుపట్ల గ్రామానికి ఆర్టీసీ బస్సు సౌకర్యం కల్పించాలని బీజేపీ ఎస్సీ మోర్చా రాష్ట్ర జాయింట్ కన్వీనర్ వంగూరి రమేష్ కోరారు. మండలంలోని చందుపట్ల గ్రామంలో సోమవారం జరిగిన సమావేశంలో మాట్లాడారు. సూర్యాపేట డిపో మేనేజర్‌కు వినతిపత్రం అందజేశామన్నారు. చందుపట్ల, పోలుమళ్ల, ముకుందాపురం, చిననెమిల ఎక్స్ రోడ్డు మార్గాలకు ఆర్టీసీ బస్సు నడిపించాలని కోరారు. కార్యక్రమంలో కనకయ్య, ఆకారపు ఉప్పలయ్య, పాల్వాయి నాగయ్య, పాల్వాయి రవి, చింతకుంట్ల శ్రీనివాస్, రుద్రపు శ్రీను పాల్గొన్నారు.

తిరుమలగిరి: అశ్వారావుపేట ఎస్ఐ శ్రీనివాస్ మృతికి కారకులను విధుల నుంచి తొలగించాలని మాల మహానాడు మండల ఉపాధ్యక్షుడు గంట సందీప్ డిమాండ్‌చేశారు. తిరుమలగిరిలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. నిందితులను కఠినంగా శిక్షించాలని, లేనిపక్షంలో సంఘం ఆధ్వర్యంలో ఆందోళన చేస్తామన్నారు. కార్యక్రమంలో మాల మహానాడు నాయకులు మద్దెల ప్రభుదాస్, గంట యాకూబ్, సాల్మన్ పాల్గొన్నారు.

అర్వపల్లి: ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న పేద విద్యార్థులను ఆదుకోవడమే లక్ష్యమని రేఖచారిటబుల్ ఫౌండేషన్ చైర్మన్, మాజీ సర్పంచ్ మడ్డి పద్మ అన్నారు. జాజిరెడ్డిగూడెం మండలంలోని కోమటిపల్లి గ్రామ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు నోటుబుక్స్ ఉచితంగా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం సైదులు, ఉపాధ్యాయులు ఆర్. సృజన, అంగన్‌వాడీ టీచర్ శివరంజని తదితరులు పాల్గొన్నారు.

హుజూర్‌నగర్ రూరల్: హుజూర్‌నగర్ మండలంలో డెంగీ, మలేరియా లాంటి విషజ్వరాలను అరికట్టాలని హుజూర్‌నగర్ ఏరియా ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సభ్యుడు, మాజీ ఎంపీపీ గూడెపు శ్రీనివాసు కోరారు. పట్టణంలోని ఏరియా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బూరుగడ్డ, మండలంలోని రోగులను పరామర్శించారు. కార్యక్రమంలో డాక్టర్ భరణి, వీరస్వామి, గురవయ్య, పుల్లయ్య, అజయ్, గోపీచంద్ పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం..

నడిగూడెం: మాదక ద్రవ్యాలతో దుష్పలితాలు ఏర్పడుతాయని ఎస్ఐ అంజయ్‌కుమార్ అన్నారు. 'మాదక ద్రవ్యాల అనర్థం' అనే అంశంపై మండలంలోని కరవిరాల ఆదర్శ పాఠశాల విద్యార్థులకు సోమవారం అవగాహన కల్పించారు. యువత మత్తు పదార్థాలకు బానిస కాకుండా చూడాల్సిన బాధ్యత తల్లిదండ్రులు, ఉపాధ్యాయులపై ఉందన్నారు. సైబర్ నేరాలపై వివరించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ షరీఫ్ పాల్గొన్నారు.

నడిగూడెం: నడిగూడెంలోని కోదండ రామస్వామి కల్యాణ మండప నిర్మాణానికి పలువురు దాతలు సోమవారం విరాళం ఇచ్చారు. కోదాడకు చెందిన గోపాల్‌రావు దంపతులు రూ.20,116, రాంపల్లి వెంకటేశ్వర్లు, సుజాత దంపతులు రూ.20,116లు విరాళంగా అందజేశారు. దాతలను ఆలయ కమిటీ చైర్మన్ బి. వెంకటరత్నం సన్మానించారు.

కోదాడటౌన్: మొక్కలు నాటి సంరక్షించాలని కేఆర్ఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ రేపాల శ్రీనివాస్ అన్నారు. కళాశాల ప్రాంగణంలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపక బృందం జి. శ్రీనివాస్, పి. జ్యోత్స్న, దేవమని, ఆర్. గురవయ్య, వి. వాసు, వి. వెంకటేశ్వర్లు, జి. యాదగిరి, మారంరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, వి. బలబీమరావు, ఆర్. రమేష్‌శర్మ, రత్నకుమారి, బి. రమేష్‌బాబు పాల్గొన్నారు.

నాగారం: ప్రతి ఒక్కరూ ఇళ్లలో మొక్కలు నాటాలని వర్ధమానుకోట గ్రామ ప్రత్యేక అధికారి, తహసీల్దార్ బ్రహ్మయ్య అన్నారు. వర్ధమానుకోటలో వనమహోత్సవంలో భాగంగా ఉపాధి కూలీలతో కలిసి రోడ్డు వెంట మొక్కలు నాటే కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి అంబేడ్కర్, ఫీల్డ్ అసిస్టెంట్ రవిందర్ పాల్గొన్నారు.

సూర్యాపేటటౌన్: మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి తెలంగాణ ఆధ్వర్యంలో మాదిగ ఉద్యమ వీరుడు అవార్డును జిల్లా కేంద్రానికి చెందిన పల్లేటి లక్ష్మణ్‌మాదిగ అందుకున్నారు. హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో ఎమ్మార్పీఎస్ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు మేడిపాపయ్యమాదిగ నుంచి ఆయన అవార్డు అందుకున్నారు.

హుజూర్‌నగర్ అభివృద్ధికి కృషి చేయాలి



హుజూర్‌నగర్‌లో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పద్మావతిరెడ్డి

హుజూర్‌నగర్, జూలై 8: హుజూర్‌నగర్ మునిసిపాలిటీ అభివృద్ధికి పాలకవర్గం కృషిచేయాలని ఎమ్మెల్యే పద్మావతిరెడ్డి అన్నారు. క్యాంప్ కార్యాలయంలో సోమవారం జరిగిన సమావేశంలో మాట్లాడారు. కోదాడ, హుజూర్‌నగర్ మున్సిపాల్టీల అభివృద్ధికి ప్రత్యేక నిధులు కేటాయిస్తామన్నారు. కార్యక్రమంలో చైర్‌పర్సన్ గెల్లి అర్చనరవి, కౌన్సిలర్లు సంపత్‌రెడ్డి, ఓరుగంటి నాగేశ్వరరావు, ఫణికుమారి, కుంట ఉపేంద్ర, కారింగుల విజయ, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు. కాంగ్రెస్ నాయకుడు, జర్నలిస్ట్ ఎలక సైదులు కుటుంబాన్ని కోదాడ ఎమ్మెల్యే పద్మావతి రెడ్డి పరామర్శించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ గూడెపు శ్రీనివాసు, ఎలక వెంకటేశ్వర్లు, బెల్లంకొండ వెంకటేశ్వర్లు, సంపత్‌రెడ్డి, రాజారమేష్ పాల్గొన్నారు.

మేళ్లచెర్వు: కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల కుటుంబాలకు అండగా ఉంటామని కోదాడ ఎమ్మెల్యే ఉత్తమ్ పద్మావతి అన్నారు. మేళ్లచెర్వు-2 మాజీ ఎంపీటీసీ మారిశెట్టి శివరాణి భర్త అచ్యుతరావు(41) అనారోగ్యంతో ఇటీవల మృతిచెందాడు. ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయకులు భాస్కర్‌రెడ్డి, శంభిరెడ్డి, సైదేశ్వరరావు, గోవిందరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కోదాడ రూరల్: తమ్మర గ్రామ మాజీ సర్పంచ్ సామినేని వెంకటేశ్వర్లు మృతి గ్రామానికి తీరనిలోటని ఎమ్మెల్యే పద్మావతి అన్నారు. సామినేని వెంకటేశ్వర్లు కుటుంబ సభ్యులను సోమవారం పరామర్శించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ సామినేని ప్రమీల రమేష్, కౌన్సిలర్ నరేష్, నాయకులు లక్ష్మీనారాయణ రెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ కందుల కోటేశ్వరరావు, బషీర్ ఉన్నారు. సామినేని వెంకటేశ్వర్లు అంత్యక్రియల్లో అన్ని రాజకీయ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ టీచర్ ఎంపికపై వివాదం

మునగాల రూరల్, జూలై 8: మండల పరిధిలోని బరాకత్‌గూడెం గ్రామంలో అంగన్‌వాడీ టీచర్ ఎంపికపై వివాదం నెలకొంది. గ్రామస్థులు అంగన్‌వాడీ పాఠశాల ఎదుట సోమవారం ఆందోళన చేశారు. గ్రామంలోని అంగన్‌వాడీ సెంటర్-3 లో కొన్ని సంవత్సరాలుగా అంగన్‌వాడీ కార్యకర్తగా పనిచేస్తున్న బీసీ-ఈ మైనార్టీ వర్గానికి చెందిన మహిళను నోటిఫికేషన్ వేయకుండా, గ్రామస్థులకు తెలియపర్చకుండా ఏకపక్షంగా ఎంపిక చేశారని ఆరోపించారు. నూతనంగా ప్రారంభోత్సవం చేస్తున్న అంగన్‌వాడీ కేంద్రాన్ని గ్రామస్థులు ముట్టడించి ఆందోళన చేశారు. ఈ విషయాన్ని కోదాడ సీడీపీవో పారిజాతకు తెలిపారు. అంగన్‌వాడీ కేంద్రానికి వచ్చే వరకు తాము ఆందోళన విరమించబోమని గ్రామస్థులు బైఠాయించారు. సీడీపీవో పారిజాత అంగన్‌వాడీ కేంద్రం వద్దకు వచ్చారు. ఎలాంటి నోటిఫికేషన్ వెలువర్చకుండా, గ్రామస్థులు, గ్రామాల్లోని ప్రజాప్రతినిధులకు తెలియపర్చకుండా రహస్యంగా అంగన్వాడీ టీచర్‌ను ఎంపిక చేసి కేంద్రాన్ని ఎలా ప్రారంభిస్తారని ప్రశ్నించారు. గ్రామంలోని అంగన్వాడీ కేంద్రం-3లో పది సంవత్సరాలుగా టీచర్ పోస్టు రిజర్వేషన్‌ను కన్వర్ట్ క్రిస్టియన్‌కు కేటాయించారని సీడీపీవో పారిజాత తెలిపారు. గ్రామంలో కన్వర్ట్ క్రిస్టియన్లు ఎవరూ లేకపోవడంతో అధికారుల ఆదేశానుసారం సీనియర్ అంగన్‌వాడీ కార్యకర్తగా ఉన్న ఇదే గ్రామానికి చెందిన బీసీ-ఈ మైనార్టీ మహిళను నియమించినట్లు తెలిపారు. గ్రామస్థులకు అభ్యంతరం ఉంటే లిఖితపూర్వకంగా ఇవ్వాలన్నారు.

కాంగ్రెస్ పార్టీతోనే అభివృద్ధి సాధ్యం

కోదాడటౌన్, జూలై 8: కాంగ్రెస్ పాలనలోనే దేశం, రాష్ట్ర అభివృద్ధి పథంలో పయనిస్తుందని కోదాడ మునిసిపల్ వైస్ చైర్మన్ కందుల కోటేశ్వరరావు అన్నారు. దివంగత సీఎం వైఎస్ రాజశేఖర్‌రెడ్డి జయంతిని పురస్కరించుకొని శ్రీరంగాపురంలో వైఎస్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయకులు, చిత్తలూరి శివయ్య, వెంకట్‌రెడ్డి, సైదా, వనపర్తి రామయ్య, కిరణ్, శిరంశెట్టి వెంకటేశ్వర్లు, రాముడు, కరీం, బొజ్జ కన్నయ్య, పాల్గొన్నారు.

మద్దిరాల: మాజీ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి జయంతి సందర్భంగా కాంగ్రెస్ జిల్లా నాయకుడు మద్దెల బిక్షపతి ఆధ్వర్యంలో కాంగ్రెస్ కార్యకర్త కుటుంబానికి 50కేజీ బియ్యం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు చిలువేరు సోమయ్య, కొమరయ్య, మద్దెల యాకయ్య, బీసు రవి, రమేష్ పాల్గొన్నారు.

హుజూర్‌నగర్ రూరల్: వైఎస్ఆర్ ఆశయాలు సాధించాలని కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ కన్వీనర్ సుతారి శ్రీనివాసు కోరారు. మండల పరిధిలోని బూరుగడ్డలో వైఎస్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో నర్సమ్మ, రాములమ్మ, వెంకటలక్ష్మీ, వెంకన్న పాల్గొన్నారు.

కోదాడ రూరల్: కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో మండలంలో వైఎస్ రాజశేఖర్‌రెడ్డి 75వ జయంతి నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు ఎస్‌కె సోందుమియా, అమర్‌నేని వెంకటేశ్వరరావు, కనగాల రాధాకృష్ణ, సామ రంగారెడ్డి, బాలెబోయిన మైసయ్య, జానీ, రాధా కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

తుంగతుర్తి: తుంగతుర్తి చౌరస్తాలో వైఎస్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయకులు పెద్దబోయిన అజయ్‌కుమార్, పెండెం రామ్మూర్తి, ఓరిగంటి సత్యనారాయణ, కొండా రాజు పాల్గొన్నారు.

నూతన్‌కల్: యువజన కాంగ్రెస్ ఆధ్వర్యంలో మండల కేంద్రంలో కేక్ కట్ చేసి పంపిణీ చేశారు. కార్యక్రమంలో నాయకులు పసుల అశోక్‌యాదవ్, రేసు రాములుగౌడ్, మట్టిపల్లి సురేష్, ఏల్పుల ఉదయ్, మధు, షేక్ పాషా ఉన్నారు.

సూర్యాపేటటౌన్: ప్రజలు మెచ్చిన నాయకుడు మాజీ సీఎం వైఎస్ అని కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు అంజద్‌అలీ, మునిసిపల్ ఫ్లోర్ లీడర్ కక్కిరేణి శ్రీనివాస్ అన్నారు. జిల్లా కేంద్రంలోని కాంగ్రెస్ జిల్లా కార్యాలయంలో కేక్‌కట్‌చేసి వైఎస్ చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయకులు మాజీ ఎంపీపీ బీరవోలు రవిందర్‌రెడ్డి, కౌన్సిలర్‌లు రాపర్తి శ్రీనివాస్‌గౌడ్, రవినాయక్, వేములకొండ పద్మ, కుంభం రాజేందర్ పాల్గొన్నారు.

మఠంపల్లి: మండలకేంద్రంలో దివంగత సీఎం వైఎస్ రాజశేఖర్‌రెడ్డి జయంతి నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు ఆధూరి స్రవంతికిషోర్‌రెడ్డి, జయభరత్‌రెడ్డి, కృపానందం, ఎన్నారై తిరుమలరెడ్డి పాల్గొన్నారు.



సూర్యాపేటలో కేక్ కట్ చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

హుజూర్‌నగర్: పట్టణంలో తల్లిదండ్రులను కోల్పోయి అనాథగా మారి నాయనమ్మ సంరక్షణలో ఉంటున్న చిన్నారికి పద్మశాలీ సంఘం నాయకులు చిన్నం వీరమల్లు, కొండా లింగారావు, ముశం సత్యనారాయణ, ఉదారి సంధ్యారాణి, యాదగిరి రూ.10వేల ఆర్థిక సహాయం చేశారు. కార్యక్రమంలో సోమయ్య, అంజమ్మ తదితరులు పాల్గొన్నారు.

కోదాడ: కోదాడలో ఈనెల 20న నిర్వహించే ప్రగతిశీల మహిళా సంఘం జిల్లా మహాసభను విజయవంతం చేయాలని ఆ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కంచర్ల నర్సమ్మ కోరారు. స్థానిక లాల్‌బంగ్లాలో జరిగిన సమావేశంలో మాట్లాడారు. ప్రభుత్వాలు ఎన్ని చట్టాలు తెచ్చినా మహిళలపై లైంగికదాడులు, హత్యలు జరుగుతున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో గంగవరపు సైదమ్మ, సుజాత, లింగమ్మ, ఉపేంద్రమ్మ, వాణిశ్రీ, మంగమ్మ, మల్లీశ్వరి, కావ్య తదితరులు పాల్గొన్నారు.

కోదాడ రూరల్: మండలంలోని దోరకుంట, నెమలిపురి ఆర్‌అండ్‌ఆర్ సెంటర్‌లలో మంగళవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని రూరల్ ఏఈ ఆర్.శ్రీనివాసరావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. కొత్త అగ్రికల్చర్ లైన్ కోసం పనిచేయాల్సి ఉన్నందున ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేయనున్నట్లు తెలిపారు.

నడిగూడెం: నాటిన మొక్కలను సంరక్షించాలని జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ సోమయ్య అన్నారు. ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో వనమహోత్సవాన్ని నిర్వహించారు. ఒక్కో విద్యార్థి ఒక మొక్క నాటాలన్నారు.

హుజూర్‌నగర్: వివిధ శాఖల్లో పనిచేస్తున్న వీఆర్‌ఓలను రెవెన్యూ శాఖలోకి తీసుకోవాలని ఆ సంఘం రాష్ట్ర కన్వీనర్ షేక్ మౌలానా, జానీ పాషా కోరారు. వివిధ శాఖల్లో పనిచేస్తున్న వీఆర్వోలు సోమవారం పట్టణంలోని ఉత్తమ్ క్యాంప్ కార్యాలయంలో కోదాడ ఎమ్మెల్యే పద్మావతిరెడ్డికి వినతి పత్రం అందజేశారు. రెవెన్యూ శాఖలో పనిచేసిన వీఆర్వోలను అదే శాఖలో కొనసాగించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో హుస్సేన్, నాగార్జున, కిరణ్‌కుమార్, వెంకటేశ్వర్లు, నాగేశ్వరరావు, పిచ్చయ్య ఉన్నారు.

హుజూర్‌నగర్ రూరల్: హుజూర్‌నగర్ భవన నిర్మాణ కార్మిక సంఘం మాజీ అధ్యక్షుడు అబ్దుల్ గఫార్(61) బ్రెయిన్ స్ట్రోక్‌తో సోమవారం మృతిచెందారు. ఆదివారం ఆయనకు బ్రెయిన్ స్ట్రోక్ రాగా ఖమ్మం ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ సోమవారం మృతిచెందారు. ఆయనకు భార్య, ముగ్గురు పిల్లలు ఉన్నారు. సుదీర్ఘకాలం సీఐటీయూ అనుబంధ భవన నిర్మాణ కార్మిక సంఘం అధ్యక్షుడిగా పనిచేశారు.